

ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక: 57 | ఎడిటర్: మేనం శ్యామ్ | మంగళవారం 15-09-2026 | పేజీలు: 10

సిరా చుక్క

పార్వతీదేవి తన దేహపు నలుగుపిండితో
బాల గణేశుడిని సృష్టించిన రోజు...
తల్లి మాటను కాపాడుతూ నిలిచిన
గణేశుడికి, శివుడితో జరిగిన ఘర్షణలో
శిరస్సు కోల్పోయిన కథ...
ఏనుగు తలను అమర్చి గణేశుడికి
పునర్జన్మ ప్రసాదించిన పరమశివుడు...
అలా గజాననుడిగా అవతరించిన
గణపయ్యను దేవతలంతా ఆశీర్వదించి,
విఘ్నాలను తొలగించే దేవుడిగా
గౌరవించారు...
అగ్రపూజ అందుకునే అధికారం పొందిన
గణనాథుడు, అప్పటి నుంచి భక్తుల
ఆరాధ్య దైవంగా మారాడు...
కాలం మారింది... పూజా విధానాలు
మారాయి... కానీ గణపయ్యపై
భక్తి మాత్రం తరతరాలుగా
కొనసాగుతోంది...బాల గణపయ్య నుంచి
స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో సామూహిక
వినాయక ఉత్సవాల వరకు పండుగ
కొత్త రూపాన్ని సంతరించుకుంది...
నేడు ప్రతి వీధిలోనూ గణనాథుడి విగ్రహాలు,
పూజలు, భజనలు, సాంస్కృతిక
కార్యక్రమాలతో సందడి నెలకొంది...
పుట్టుక నుంచి నేటి వరకు... గణపయ్య కథ
ఒక్కటే చెబుతోంది..విఘ్నాలు ఎన్ని
ఎదురైనా ధర్మం, భక్తి, మంచితనం చివరికి
విజయాన్ని అందిస్తాయని..

నడ్డి శివకృష్ణ యాదవ్.
సబ్ ఎడిటర్..
ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో. ....

ఖైరతాబాద్ మహాగణపతికి గవర్నర్ తొలి పూజ!

- గవర్నర్ దంపతులకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం
- 69 అడుగుల గణనాథుడికి తొలి పూజ చేసిన గవర్నర్
- భక్తులకు ఇబ్బందులు లేకుండా భారీ ఏర్పాట్లు: పొన్నం
- ఖైరతాబాద్ గణపతికి 72 ఏళ్ల చరిత్ర: మంత్రి
- లక్షలాది మంది భక్తులు తరలివస్తారు: తలసాని







ప్రజా వాయిస్, హైదరాబాద్:తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతులు సోమవారం ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకుని తొలి పూజలు నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకులు గవర్నర్ దంపతులకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. తొలి పూజ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొన్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

ఖైరతాబాద్ గణపతికి తొలి పూజ చేయడం ఎంతో ఆనందంగా ఉందని గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. తెలంగాణ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. మహారాష్ట్రతో పాటు హైదరాబాద్‌లోనూ వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. 69 అడుగుల గణేశ్ మహారాజ్‌కు పూజలు చేయడం సంతోషంగా ఉందన్నారు. స్వామివారి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలకు సేవ చేసే అవకాశం లభించిందని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు

భక్తులకు భారీ ఏర్పాట్లు

ఖైరతాబాద్ బడా గణపతికి 72 ఏళ్ల చరిత్ర ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. భారీ భద్రతా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఉత్సవాల నిర్వహణపై అన్ని కమిటీలతో ఇప్పటికే రెండుసార్లు సమావేశాలు నిర్వహించామని తెలిపారు. గత మూడేళ్లుగా మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు.

సమృద్ధిగా వర్షాల కోసం ప్రత్యేక పూజలు

రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని గణనాథుడిని ప్రత్యేకంగా ప్రార్థిస్తున్నామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రస్తుతం ఎదురవుతున్న విపత్తులను సమర్థంగా ఎదుర్కొని ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఉత్సవాలు ప్రశాంతంగా కొనసాగేందుకు భక్తుల సహకారం కూడా అవసరమని అన్నారు.

లక్షలాది మంది భక్తుల రాక

మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

మిగతా 2లో

గాంధీభవన్‌లో గణపతి పూజ..
మహేశ్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు!

- గాంధీభవన్‌లో మహేశ్ గౌడ్ దంపతుల ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు
- కేసీఆర్ వస్తే బీఆర్ఎస్ నేతల సస్పెన్షన్ ఎత్తివేయాలని స్పీకర్‌ను కోరుతాం
- తలసానికి ప్రతిపక్ష నేత అవకాశం ఇవ్వగలరా అంటూ బీఆర్ఎస్‌కు సవాల్
- తాతా మధు వ్యాఖ్యలు బీఆర్ఎస్ దళిత వ్యతిరేక వైఖరికి నిదర్శనం
- కొత్త తెలంగాణ ఇన్‌ఛార్జ్‌పై నిర్ణయం ఏఐసీసీదే: మహేశ్ గౌడ్



ప్రజా వాయిస్, హైదరాబాద్: గాంధీభవన్‌లో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహేశ్ గౌడ్ మాట్లాడుతూ పండుగ రోజు రాజకీయాలు మాట్లాడాలని లేదని, అయితే ప్రతిపక్షాలు చేస్తున్న రాద్ధాంతం కారణంగా స్పందించాల్సి వస్తోందని అన్నారు.

కేసీఆర్ సెప్టెంబర్ 16న అసెంబ్లీకి రావాలి

కేసీఆర్ రాజకీయ విధానాలు, బీఆర్ఎస్ ఆలోచనా విధానాలను శుద్ధి చేసుకోవాలని మహేశ్ గౌడ్ వ్యాఖ్యానించారు. కేసీఆర్ సెప్టెంబర్ 16న అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే బీఆర్ఎస్ నేతలపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని స్పీకర్‌ను కోరుతామని తెలిపారు.

తలసానికి ప్రతిపక్ష నేత అవకాశం ఇస్తారా?

దళితుడిని స్పీకర్‌గా చేశామని

మిగతా 2లో

గండిపేటలో భారీగా ఆల్ఫాజోలం పట్టివేత!

- సైబరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడుల్లో 1.769 కిలోల ఆల్ఫాజోలం పట్టివేత
- అక్రమంగా తరలిస్తున్న నలుగురు నిందితుల అరెస్ట్
- వ్యాగనార్ కారు, ద్విచక్రవాహనంలో తరలిస్తుండగా పట్టుకున్న అధికారులు
- మెదక్, మహబూబ్‌నగర్‌కు సరఫరా చేస్తున్నట్లు గుర్తింపు
- సరఫరా చేసిన మరో ఇద్దరిపై కేసు
- అక్రమ తయారీదారులకు హెచ్చరిక

2 లో

హైదరాబాద్–విజయవాడ
ఆరు వరుసల రహదారికి
రూ.12,073 కోట్లు

- డిసెంబర్ నాటికి కాంగ్రెస్ ప్రజాప్రభుత్వానికి మూడేళ్లు
- ప్రతి మండల, జిల్లా కేంద్రానికి రెండేళ్లలో రెండు వరుసల రహదారులు
- అక్టోబర్‌లో హైదరాబాద్–విజయవాడ రహదారి పనులకు టెండర్లు
- జనవరిలో పనులు ప్రారంభం.. 18 నెలల్లో పూర్తి చేస్తాం: కోమటిరెడ్డి
- నల్లగొండలో రూ.1,000 కోట్లతో అభివృద్ధి పనులు



ప్రజా వాయిస్, హైదరాబాద్ బ్యూరో: కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడి డిసెంబర్ నాటికి మూడేళ్లు పూర్తవుతాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. దేశంలో ఎక్కడా లేని పథకాలను తెలంగాణలో అమలు చేస్తున్నామని తెలిపారు. సోమవారం ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడిన ఆయన.. నల్లగొండ జిల్లాలో రూ.1,000 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

రెండేళ్లలో రహదారుల నిర్మాణం

తెలంగాణలోని ప్రతి మండల కేంద్రాన్ని జిల్లా కేంద్రాలతో అనుసంధానించేలా రెండేళ్లలో రెండు వరుసల రహదారులను

మిగతా 2లో

అల్వాల్‌లో బాలికపై వరుస లైంగిక దాడులు
8 మందిపై పోక్సో కేసు..!

- 16 ఏళ్ల బాలికపై పలుమార్లు లైంగిక దాడి చేసినట్లు ఫిర్యాదు
- పరిచయమైన వ్యక్తులే మత్తు పదార్థాలు, మద్యం అలవాటు చేసినట్లు ఆరోపణ
- వేర్వేరు ప్రాంతాలకు తీసుకెళ్లి దాడులకు పాల్పడినట్లు పోలీసుల గుర్తింపు
- ఇంటికి చేరుకున్న బాలిక.. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో వెలుగులోకి ఘటన
- మరో ఎవరైనా నిందితుల ప్రమేయం ఉందా?
- మత్తు పదార్థాలపై పోలీసుల ఆరా

2 లో

కుటుంబ సమేతంగా గణపతి పూజ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

- ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి
- జూబ్లీహిల్స్ నివాసంలో కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు
- భక్తిశ్రద్ధలతో గణేశ్ ఉత్సవాలు నిర్వహించుకోవాలని పిలుపు
- రద్దీ ప్రాంతాల్లో భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు ఆదేశాలు
- గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం: సీఎం



ప్రజా వాయిస్, హైదరాబాద్:తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితంలో విఘ్నాలు తొలగి ఆనందం, ఐశ్వర్యం, ఆరోగ్యం, విజయాలు కలగాలని ఆకాంక్షించారు.

కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు

జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భార్య, కుమార్తె, అల్లుడు, మనవడు గణపతి పూజలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు

వాడవాడలా ఏర్పాటు చేసే గణేశ్ మండపాల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించుకోవాలని సీఎం సూచించారు. గణపతి ఉత్సవాలను ప్రశాంతంగా, సౌహార్ద వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు.

భద్రత, ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లాల్లో గణేశ్ ఉత్సవాల సందర్భంగా ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను సీఎం ఆదేశించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే మండపాల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

మండపాలకు ఉచిత విద్యుత్

గణేశ్ మండపాలకు ఈ ఏడాది కూడా ప్రభుత్వం ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో దాడి..
కేటీఆర్ తీవ్ర ఆగ్రహం!

- పీఆర్వో మహేశ్, పీఏ మహేందర్‌రెడ్డిపై మూకుమ్మడి దాడి: కేటీఆర్
- పోలీసుల సమక్షంలోనే దాడి జరిగిందంటూ తీవ్ర ఆరోపణలు
- ముఖ్యమంత్రి, హోంమంత్రి పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్
- పోలీస్ స్టేషన్‌లోని సీసీటీవీ దృశ్యాలను భద్రపరచాలని విజ్ఞప్తి
- గాయపడిన ఇద్దరికి రక్షణతో పాటు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్



2 లో

అసెంబ్లీ ఘటనపై సిట్ దర్యాప్తు ముమ్మరం!

- కేటీఆర్ పీఏ మహేందర్, పీఆర్వో మహేశ్‌లకు పోలీసుల విచారణ
- న్యాయవాదుల సమక్షంలో స్టేట్‌మెంట్లు నమోదు
- ఆందోళనకు ముందస్తు సమాచారం ఉందా? కుట్ర కోణంలో ఆరా
- నోటీసులు ఇవ్వాలని న్యాయవాదుల పట్టుబాటు
- అసెంబ్లీ వద్ద సీన్ రీక్రియేషన్‌కు పోలీసుల సన్నాహాలు



కేటీఆర్ పీఏ, పీఆర్వోలకు విచారణ

ప్రజా వాయిస్, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ సమావేశాల ప్రారంభం రోజున శాసనసభ మూడో నంబరు గేటు వద్ద పోలీసులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మధ్య జరిగిన తోపులాటపై సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు దూషణలు, బెదిరింపులకు పాల్పడ్డారనే ఆరోపణలపై కేసు నమోదైంది.

ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను రాబట్టేందుకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పీఏ మహేందర్, పీఆర్వో మహేశ్‌లను పోలీసులు సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. న్యాయవాదుల సమక్షంలో వారి స్టేట్‌మెంట్లను నమోదు చేస్తున్నారు. అసెంబ్లీ ఎదుట చోటుచేసుకున్న ఘర్షణ, దూషణలు, విద్వేషపూరిత వ్యాఖ్యలపై పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

కుట్ర కోణంలో ఆరా

అసెంబ్లీ ఎదుట ఆందోళనకు ముందస్తు సమాచారం ఉందా? ఉద్దేశపూర్వకంగానే ఘటనకు తెరలేపారా? అనే కోణాల్లో పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

పూజల కోసం గొడవ.. పూజారి ప్రాణం పోయింది

- మండపం వద్ద వివాదం
- ఆసుపత్రికి చేరేసరికే మృతి
- దాడి చేశారంటూ కుమారుడి ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన పోలీసులు

ప్రజా వాయిస్,తిరుమలగిరి సాగర్: గణేశ్ మండపం వద్ద పూజలు నిర్వహించే విషయంలో తలెత్తిన వివాదం విషాదంగా మారింది. పూజల కోసం జరిగిన వాగ్వాదం అనంతరం ఓ పూజారి అకస్మాత్తుగా స్పృహ తప్పి కుప్పకూలి మృతి చెందిన ఘటన నల్లగొండ జిల్లా తిరుమలగిరి సాగర్ మండలం చింతలపాలెం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. నాగార్జునసాగర్ ప్రైలాన్ కాలనీకి చెందిన ఉప్పల దత్తు ప్రసాద్ పూజారిగా విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం సుమారు 9.30 గంటల సమయంలో చింతలపాలెం గ్రామంలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన గణేశ్ మండపంలో పూజలు నిర్వహిస్తున్నారు.అదే సమయంలో గ్రామానికి చెందిన గుండాల రవి, పున్నయ్య అక్కడికి వచ్చి తమ మండపం వద్ద ముందుగా పూజలు నిర్వహించాలని దత్తు ప్రసాద్‌తో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. ఈ క్రమంలో మాటామాటా పెరిగి ఇద్దరు వ్యక్తులు పూజారిపై చేతులు వేసి గొడవకు దిగినట్లు మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

గ్రామ పెద్దల జోక్యం

పూజారి, ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదం జరుగుతున్న విషయాన్ని గమనించిన గ్రామ పెద్దలు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చినట్లు తెలిసింది. అనంతరం దత్తు ప్రసాద్‌ను గుండాల రవికి చెందిన గణేశ్ మండపం వద్దకు తీసుకెళ్లినట్లు సమాచారం.అక్కడ పూజలు పూర్తి చేసిన కొద్దిసేపటికే దత్తు ప్రసాద్ అకస్మాత్తుగా స్పృహ తప్పి కిందపడిపోయారు. దీంతో అక్కడున్న వారు వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం సాగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రికి చేరుకునే సమయానికే దత్తు ప్రసాద్ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు.

దాడి చేశారంటూ కుమారుడి ఫిర్యాదు

తండ్రి మృతిపై ఆయన కుమారుడు ఉప్పల శ్రీ వల్లభ రాఘవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూజల విషయంలో జరిగిన గొడవలో తన తండ్రిపై దాడికి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. దత్తు ప్రసాద్ మృతికి ఖచ్చితమైన కారణం పోస్టుమార్టం నివేదికలో తేలాల్సి ఉండగా.. ఘటనకు సంబంధించి పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక, దర్యాప్తులో వెలువడే ఆధారాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.



హైదరాబాద్–విజయవాడ ఆరు వరుసల రహదారికి రూ.12,073 కోట్లు

మొదటి పేజీ తరువాయి


నిర్మిస్తామని మంత్రి తెలిపారు. హడ్కో రుణంతో నిర్మాణం, నిర్వహణ పద్ధతిలో రహదారి పనులు చేపడుతున్నామని చెప్పారు. రహదారులు మెరుగ్గా ఉంటేనే రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

హైదరాబాద్–విజయవాడకు ఆరు వరుసలు

హైదరాబాద్–విజయవాడ మధ్య ఆరు వరుసల రహదారి నిర్మాణానికి రూ.12,073 కోట్లతో వచ్చే నెల అక్టోబర్‌లో టెండర్లు పిలవనున్నట్లు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. జనవరిలో పనులు ప్రారంభించి 18 నెలల్లో పూర్తి చేస్తామని వెల్లడించారు.

కేటీఆర్ పాదయాత్ర చేస్తే.. నేనూ చేస్తా

నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాదయాత్ర చేపడితే తాను కూడా పాదయాత్ర చేస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.



గుడిమల్కాపూర్‌లో రౌడీషీటర్ అరెస్ట్!

దేశీయ పిస్టల్‌తో పట్టుకున్న పోలీసులు

- టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసుల సంయుక్త ఆపరేషన్
- అబిద్ హుస్సేన్‌తో పాటు అంజద్ అదుపులోకి
- పిస్టల్, ఆరు సజీవ తూటాలు, మ్యాగజైన్, మూడు ఫోన్లు స్వాధీనం
- హత్య, కిడ్నాప్, బెదిరింపులు, వసూళ్ల కేసుల్లో నిందితుడికి గతం
- పిస్టల్ కొనుగోలుకు రూ.45 వేలకు పైగా చెల్లింపు.. పరారీలో సాహిల్

ప్రజా వాయిస్, హైదరాబాద్ బ్యూరో:హైదరాబాద్‌లోని గుడిమల్కాపూర్‌లో దేశీయ పిస్టల్‌తో తిరుగుతున్న రౌడీషీటర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కమిషనర్ టాస్క్‌ఫోర్స్ గోల్కొండ జోన్, గుడిమల్కాపూర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో సయ్యద్ అబిద్ హుస్సేన్ అలియాస్ అలీ భాయ్ అలియాస్ అలీ డాన్ (55), మహమ్మద్ అంజద్ (31)లను అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు సాహిల్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

నిందితుల వద్ద నుంచి ఒక దేశీయ పిస్టల్, మ్యాగజైన్, ఆరు సజీవ తూటాలు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అబిద్ హుస్సేన్‌పై గతంలో హత్య, హత్యాయత్నం, అపహరణ, బెదిరింపులు, వసూళ్లు, ఆయుధాల చట్టం తదితర కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. జహీరాబాద్‌లో అతనిపై రౌడీషీట్ కూడా ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించారు.

రూ.45 వేలకు పిస్టల్ కొనుగోలు

పరారీలో ఉన్న సాహిల్ నుంచి రూ.45 వేలకుపైగా చెల్లించి అబిద్ హుస్సేన్ పిస్టల్ కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఆ ఆయుధాన్ని మహమ్మద్ అంజద్ వద్ద భద్రపరిచినట్లు గుర్తించారు. ఈ వ్యవహారంపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

సాహిల్ కోసం గాలింపు

ఈ ఘటనపై గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఆయుధాల చట్టంలోని 25(1-బి)(ఎ), 29 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న సాహిల్‌ను పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చేపట్టారు. స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, తూటాలు, ఇతర వస్తువులపై దర్యాప్తు కొనసాగుతోంది.



ఖైరతాబాద్ మహాగణపతికి గవర్నర్ తొలి పూజ!



ఖైరతాబాద్‌లోని పంచముఖ సంకటహర మహాగణపతిని దర్శించుకున్నారు. ఖైరతాబాద్ గణపతికి దేశ, విదేశాల్లో విశేష గుర్తింపు ఉందన్నారు. 69 ఏళ్లుగా గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు స్వామివారి దర్శనానికి తరలివస్తారని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసిన ఉత్సవ కమిటీని అభినందించారు. ప్రజలందరిపై గణనాథుడి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు.

గాంధీభవన్‌లో గణపతి పూజ.. మహేశ్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు!

మొదటి పేజీ తరువాయి

చెప్పుకుంటున్న బీఆర్ఎస్ నేతలు.. బీసీ బిడ్డ తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ముఖ్యమంత్రిని చేశారా అని మహేశ్ గౌడ్ ప్రశ్నించారు. బీఆర్ఎస్‌కు దమ్ముంటే తలసానికి ప్రతిపక్ష నేతగా అవకాశం ఇవ్వాలని సవాల్ విసిరారు. తమ చేతుల్లో ఉన్న పనులను పూర్తి చేస్తే కేసీఆర్‌ను నమ్ముతామని అన్నారు.

తాతా మధు వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం

స్పీకర్‌ను కులం పేరుతో దూషించడం బీఆర్ఎస్ వైఖరికి నిదర్శనమని మహేశ్ గౌడ్ అన్నారు. ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు అనుకోకుండా జారిన మాటలు కావని, బీఆర్ఎస్ పార్టీ నరనరానా దళిత వ్యతిరేకత ఉందని ఆరోపించారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ దళిత కార్డును ఉపయోగించుకున్నారని, దళిత కవులు, కళాకారులను అవమానించిన ఘటనలు ఉన్నాయని అన్నారు.

దళిత హామీలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

కేసీఆర్ హయాంలో దళితులకు ఇచ్చిన హామీల అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. దళితబంధు పథకాన్ని ఉప ఎన్నికల కోసమే తీసుకొచ్చారని ఆరోపించారు. అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు చేసినంత మాత్రాన ఆయన వారసులు కాలేరని వ్యాఖ్యానించారు. 'దళితులు నడిచిన రోడ్డును శుద్ధి చేయడమేంటి? దళితులపై బీఆర్ఎస్ నేతలకు ఇంత అక్కసు ఉందా?' అని ప్రశ్నించారు.

మీనాక్షి నటరాజన్ అంశంపై స్పందన

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ విదేశాల్లో చదువుకోవడానికి వెళ్తున్నారని మహేశ్ గౌడ్ తెలిపారు. ఆమె విషయంలో అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాల్సి ఉందన్నారు. కొత్త ఇన్‌చార్జ్ నియామకంపై ఏఐసీసీ నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు. కొండా సురేఖను అధిష్ఠానం పిలిచిందన్న విషయం తనకు తెలియదని స్పష్టం చేశారు.

సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో దాడి.. కేటీఆర్ తీవ్ర ఆగ్రహం!

ప్రజా వాయిస్, హైదరాబాద్: రేవంత్‌రెడ్డి హయాంలో తెలంగాణలో రౌడీలు, గూండాల రాజ్యం నడుస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. తన పీఆర్వో మహేశ్, పీఏ మహేందర్‌రెడ్డిపై సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన దాడిపై ఆయన సామాజిక మాధ్యమం వేదికగా స్పందించారు.

ఉద్దేశపూర్వకంగానే కాలయాపన చేశారా?

విచారణకు ఉదయం రావాలని నోటీసులు ఇచ్చిన పోలీసులు రాత్రి వరకు ఎందుకు విచారణ చేయలేదని కేటీఆర్ ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేసి తన పీఆర్వో, పీఏలపై మూకుమ్మడి దాడికి కుట్ర పన్నారని ఆరోపించారు. నగరం నడిబొడ్డున ఉన్న సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లోకి 15 మంది చొరబడి విచారణకు వచ్చిన వారిపై దాడి చేయడమేంటని నిలదీశారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అని కేటీఆర్ మండిపడ్డారు. దాడి చేసిన వారు రౌడీలేనా, కాంగ్రెస్ గూండాలా, లేక పోలీసుల ముసుగులో దాడి చేయించారా అని ప్రశ్నించారు. ఈ ఘటనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర హోంశాఖ మంత్రి పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణకు ఆదేశించాలని కోరారు.

సీసీటీవీ దృశ్యాలు భద్రపరచాలి

తదుపరి ఆదేశాలు వచ్చే వరకు పీఆర్వో, పీఏలపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా దాడి చేయడం రాజకీయ

గండిపేటలో భారీగా ఆల్ఫాజోలం పట్టివేత!

ప్రజా వాయిస్, హైదరాబాద్ బ్యూరో: గండిపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సైబరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు భారీగా ఆల్ఫాజోలం పట్టుకున్నారు. మంచిరేవుల, గండిపేట ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 1.769 కిలోల ఆల్ఫాజోలం స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.24.18 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ వ్యవహారంలో నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు.

రెండు వాహనాల్లో తరలింపు

మెదక్, మహబూబ్‌నగర్ ప్రాంతాలకు ఆల్ఫాజోలం తరలిస్తున్నారనే సమాచారంతో అధికారులు తనిఖీలు చేపట్టారు. తొలుత వ్యాగనార్ కారులో తరలిస్తున్న 751 గ్రాముల ఆల్ఫాజోలం పట్టుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. మరో ఘటనలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 1.18 కిలోల ఆల్ఫాజోలం స్వాధీనం చేసుకున్నారు.

నలుగురు అరెస్ట్

ఈ కేసుల్లో మెదక్, మహబూబ్‌నగర్‌కు చెందిన లింగరాజు గౌడ్, టి. ఆంజనేయులు, ఆర్. రమేష్, కాటమయ్యలను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులకు ఆల్ఫాజోలం సరఫరా చేసిన మరో ఇద్దరిపై కూడా కేసు నమోదు చేసినట్లు సైబరాబాద్ సహాయ కమిషనర్ జి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆల్ఫాజోలం, వాహనాలు, నిందితులను గండిపేట ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్లు వెల్లడించారు.

చట్టపరమైన చర్యలు తప్పవు

కల్లు తయారీలో వినియోగించే ఆల్ఫాజోలం అక్రమంగా తీసుకువచ్చినా, దానితో కల్లు తయారు చేసినా కఠిన చర్యలు తప్పవని సహాయ కమిషనర్ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ఈ దాడిలో సైబరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సూర కృష్ణ, ఎస్సై రమేష్, శిక్షణ ఎస్సైలు రమణ, రమేష్, గిరి, హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. భారీ మొత్తంలో ఆల్ఫాజోలం పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.



అల్వాల్‌లో బాలికపై వరుస లైంగిక దాడులు .. 8 మందిపై పోక్సో కేసు..!

ప్రజా వాయిస్, హైదరాబాద్:హైదరాబాద్ అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 16 ఏళ్ల బాలికపై పలువురు లైంగిక దాడులకు పాల్పడినట్లు ఫిర్యాదు అందింది. ఘటనపై అల్వాల్ పోలీసులు ఎనిమిది మందిపై పోక్సో చట్టంతోపాటు సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.పరిచయమైన వ్యక్తులే లక్ష్యం గాబాధితురాలు ఇంటర్ చదువుతున్నట్లు పోలీసులు తెలిపారు. పదో తరగతిలో ఉన్న సమయంలో పరిచయమైన ఓ యువకుడు మత్తు పదార్థం కలిపిన



క్రౌన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఎక్సలెన్స్ విజేతగా కట్ల లక్కీ శ్రీ

- వైజాగ్ లో ప్రతిష్టాత్మక పోటీలు
- సుల్తానాబాద్ యువతి ఘన విజయం

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైజాగ్‌లోని గాదిరాజు ప్యాలెస్‌లో నిర్వహించిన ప్రతిష్టాత్మక క్రౌన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పోటీల్లో సుల్తానాబాద్ పట్టణానికి చెందిన కట్ల లక్కీ శ్రీ, ప్రతిభ కనబరిచి క్రౌన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఎక్సలెన్స్ విజేతగా నిలిచారు.ఈ పోటీలకు ఆన్‌లైన్ ద్వారా సుమారు 200 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, వివిధ విభాగాల నుంచి ప్రతిభ ఆధారంగా 20 మంది చొప్పున తుది పోటీలకు ఎంపికయ్యారు. తుది పోటీల్లో వివిధ దశల్లో నిర్వహించిన పోటీల్లో లక్కీ శ్రీ తన ప్రతిభను చాటుకుని క్రౌన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఎక్సలెన్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. ప్రతిష్టాత్మక పోటీల్లో సుల్తానాబాద్‌కు చెందిన కట్ల లక్కీ శ్రీ విజేతగా నిలవడం పట్ల పట్టణ ప్రజలు, కుటుంబ సభ్యులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

వాగులు దాటేదెలా.. పొలం చేరేదెలా?

- వర్షాలకు మురిసినా.. దారుల్లేక సతమతం
- బురదమయమైన బాటలు.. ప్రమాదకరంగా వాగులు, వంకలు
- నాయకుల పక్షాంతర రాజకీయాలు.. పట్టని రైతన్న కష్టాలు
- శాశ్వత పరిష్కారం చూపాలని మంథని ప్రాంత రైతుల విజ్ఞప్తి





ప్రజా వాయిస్ మంథని ఒకవైపు ముసురు వర్షాలు కురుస్తుండటంతో పంటలకు జీవం వచ్చిందని సంతోషించాలో.. ఆ పంట చేన్లకు వెళ్లే దారి లేక పడుతున్న తిప్పలకు కలత చెందాలో తెలియని దుస్థితిలో మంథని డివిజన్ రైతాంగం కొట్టుమిట్టాడుతోంది. వర్షాలు సమృద్ధిగా పడుతున్నాయన్న ఆనందం రైతుల ముఖాల్లో కనిపిస్తున్నా, పొలాల బాటలు బురదమయంగా మారడంతో అడుగు ముందుకు వేయలేని స్థితి నెలకొంది. మంథని రెవెన్యూ డివిజన్ వ్యాప్తంగా ప్రధాన గ్రామాలకు, అనుబంధ పల్లెలు, వ్యవసాయ పొలాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. వర్షపు నీటితో కచ్చా రోడ్లన్నీ బురద కుంటలను తలపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో పొలాలకు వెళ్లాలంటే పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు దాటక తప్పదం లేదు. ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని వాగులు దాటుతూ, ఎద్ద బండ్లు, ట్రాక్టర్లు బురదలో నిలిచిపోతుండటంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మంథని డివిజన్ కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గ్రామాలు, పల్లెల పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. దశాబ్దాలు గడుస్తున్నా ఈ ప్రాంత రైతుల కష్టాలు, బతుకులు మాత్రం మారడం లేదు.

నాయకులకు స్వార్థం తీవ్రం.. సమస్యలపై నిమ్మకు నీరెత్తినట్లు

ఓ వైపు రైతులు దారి లేక రోదిస్తుంటే, ఎన్నికైన ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు మాత్రం తమ స్వార్థ రాజకీయాల్లో మునిగితేలుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ కండువా కప్పుకోవడానికే ప్రాధాన్యమిస్తున్న నాయకులు, తాము ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాల్లోని నిరుపేద రైతుల ప్రాథమిక సమస్యలను పట్టించుకోవడంలో తీవ్రంగా విఫలమవుతున్నారు. ఎన్నికల సమయంలో హామీల వర్షం కురిపించే నాయకులు, గెలిచాక పక్షాంతర రాజకీయాలకే పరిమితమవుతున్నారని స్థానిక రైతాంగం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించాలని మంథని ప్రాంత రైతులు కోరుతున్నారు. వర్షాల వల్ల అధ్వానంగా మారిన రహదారులకు మరమ్మతులు చేపట్టడంతో పాటు, పొలాలకు వెళ్లే బాటల్లో వాగులపై కల్వర్టులు, వంతెనలు నిర్మించి తమ దీర్ఘకాలిక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకుంటున్నారు.

ఒడిశా నుంచి గంజాయి సరఫరా

- శంషాబాద్ లో గుట్టు రట్టు.!
- 8 కిలోల గంజాయితో యువకుడి అరెస్టు
- రూ.4 లక్షల విలువైన సరుకు స్వాధీనం
- పరారీలో గంజాయి సరఫరా నిందితుడు
- హైదరాబాద్ లో ఎవరికి విక్రయించాలనే దానిపై పోలీసుల ఆరా



ప్రజా వాయిస్/ రాజేంద్రనగర్: హైదరాబాద్‌లో గంజాయి విక్రయించేందుకు ఒడిశా నుంచి అక్రమంగా తరలించిన 8 కిలోల గంజాయి పోలీసులకు పట్టుబడింది.గంజాయి తరలిస్తున్న ఒడిశాకు చెందిన రాజ్ ప్రధాన్ అలియాస్ గౌరా(22)ను శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఆర్జీఐఏ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి నిందితుడిని అరెస్టు చేశారు.అతడి వద్ద నుంచి 8 కిలోల గంజాయి,ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం..గంజాయి సరఫరా చేస్తున్న ఒడిశాకు చెందిన రామ్ బ్రాడా అలియాస్ బోలారం అలియాస్ రామ్ వద్ద నిందితుడు గంజాయిని కొనుగోలు చేసినట్లు విచారణలో తేలింది.ఒడిశా నుంచి గంజాయిని హైదరాబాద్‌కు తీసుకొచ్చి ఇక్కడ వినియోగదారులకు అధిక ధరకు విక్రయించేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు.విశ్వసనీయ సమాచారం అందడంతో రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్ బృందం నిందితుడిని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకుంది. కేసును ఆర్జీఐఏ పోలీసులకు అప్పగించగా, క్రైమ్ నంబర్ 815/2026గా నమోదు చేసి ఎన్‌డీపీఎస్ చట్టం కింద దర్యాప్తు చేస్తున్నారు.సరఫరాచేసే నిందితుడు పరారీలో ఉండటంతో గంజాయి ఎక్కడి నుంచి వస్తోంది.? హైదరాబాద్‌లో ఎవరికి చేరుతోంది.? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.నిందితుడి సెల్‌ఫోన్‌లోని వివరాలను పరిశీలిస్తూ గంజాయి నెట్‌వర్క్‌కు సంబంధించిన మరిన్ని ఆధారాలను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.



చినుకు పడితే చిత్తడవుతున్న చౌరస్తా

- అతలాకుతలమవుతున్న హనుమకొండ నగరం
- పాలకుల నిర్లక్ష్యంపై బీజేపీ రావు పద్మారెడ్డి ఆగ్రహం
- మాటలు తప్పితే చేతలు లేని స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి పాలకుల ఘోర నిర్లక్ష్యం కారణంగా చిన్నపాటి వర్షానికే హనుమకొండ నగరం పూర్తిగా అతలాకుతలమవుతోందనీ బీజేపీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే కాంటెస్టెడ్ కాండిడేట్ రావు పద్మారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని ప్రధాన చౌరస్తాలన్నీ అత్యంత అధ్వాన్నంగా తయారయ్యాయని ఆమె మండిపడ్డారు. స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి మాటలు చెప్పడంపై ఉన్న శ్రద్ధ, నగరాభివృద్ధిపై లేదని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే మాటలు కోటలు దాటుతున్నా, చేతలు మాత్రం శూన్యమని విమర్శించారు.ప్రస్తుతం చిన్నపాటి వర్షం కురిసినా చౌరస్తాలన్నీ చెరువులను తలపిస్తూ జలమయమవుతున్నాయి. హనుమకొండ నగరంలో సరైన డ్రైనేజీ సౌకర్యం లేకపోవడం, ఉన్న డ్రైనేజీలు సైతం సకాలంలో పూడికతీతకు నోచుకోకపోవడం వల్లే వర్షపు నీరంతా రోడ్లపైకి వస్తోందని ఆమె ఆరోపించారు. దీనివల్ల నిత్యం వేలాది మంది వాహనదారులు, పాదచారులు నరకయాతన అనుభవిస్తున్నారు. రోడ్డుపై గుంతలు ఎక్కడున్నాయో తెలియక ద్విచక్ర వాహనదారులు నిరంతరం ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షపు నీరు చుట్టు చేరుతుండటంతో చిరు వ్యాపారులు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నగరంలో నెలకొన్న ఈ రోడ్ల దుస్థితి, డ్రైనేజీ సమస్యల పై ఎలాంటి చలనం లేకపోవడం విచారకరమన్నారు. పాలకుల బాధ్యతారాహిత్యం వల్లే సామాన్య ప్రజలు ఇన్ని అవస్థలు పడాల్సి వస్తోందని స్థానికులు తీవ్రంగా మండిపడుతున్నారని రావు పద్మారెడ్డి గుర్తు చేశారు. ఇప్పటికైనా మున్సిపల్, స్థానిక అధికారులు మరియు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి, చౌరస్తాలలో నిలిచిన నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి, గుంతలమయమైన రోడ్లను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. పాలకులలో ఇప్పటికైనా చలనం రాకపోతే, హనుమకొండ నగర ప్రజలను, బీజేపీ శ్రేణులను సమీకరించి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు, ఆందోళనలు చేపడతామని రావు పద్మారెడ్డి హెచ్చరించారు.



చెత్త ఎత్తే చేతులు ఖాళీ..!

- మూడు నెలలుగా జీతాల కోసం ఎదురుచూపులు!
- 9వ రోజుకు చేరిన వికారాబాద్ మున్సిపల్ కార్మికుల నిరసన
- మున్సిపల్ చైర్మన్ తక్షణమే స్పందించాలి
- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.మహిపాల్

ప్రజా వాయిస్/వికారాబాద్ బ్యూరో: వికారాబాద్ మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలు సోమవారం 9వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా బి జె ఆర్ చౌరస్తా నుంచి ఎం ఆర్ పి చౌరస్తా మీదుగా మున్సిపల్ వైస్ చైర్మన్ అర్ర సుధాకర్ రెడ్డి నివాసం వరకు డప్పులతో భారీ ర్యాలీ నిర్వహించి వినతి పత్రం అందజేశారు.మున్సిపల్ కార్మికులకు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని, కార్మికులకు ఇండ్లు, ఇంటి స్థలాలు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. అనారోగ్యంతో మృతి చెందిన మున్సిపల్ కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం అందించాలని, వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలి. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.32 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. మహిపాల్ మాట్లాడుతూ.. మూడు నెలలుగా జీతాలు అందక మున్సిపల్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి పెండింగ్ జీతాలను విడుదల చేసేలా అధికారులను ఆదేశించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్మికుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మె బాట పట్టక తప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు కార్యదర్శి శంకర్ నాయక్, బుచ్చయ్య, పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.

బికనూరులో వివాహితపై ఆసిడ్ దాడి

- చికిత్స పొందుతూ మహిళ మృతి
- అత్తింటి వారు హత్య చేశారని తండ్రి ఫిర్యాదు
- కామారెడ్డి డి.ఎస్.పి ఆధ్వర్యంలో దర్యాప్తు



ప్రజా వాయిస్ భిక్కనూరు/కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండల కేంద్రంలో వివాహితపై ఆసిడ్ దాడి జరిగింది. బాధితురాలు చికిత్స పొందుతూ సోమవారం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో మృతి చెందారు. దారుణమైన ఈ సంఘటన గూర్చి బిక్కనూరు గ్రామస్తులు,కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..ఇల్లు విడిచి బయటకు వెళ్లిన దివ్యవాణి వివాహితపై యాసిడ్ దాడి జరిగింది. బాధితురాలు చికిత్స పొందుతూ మృతి చెందిందని కుటుంబ సభ్యులు గ్రామస్తులు తెలిపారు. బిక్కనూరు లో జరిగిన ఘోర సంఘటనపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. బిక్కనూరు కు చెందిన దివ్యవాణి 32కి 10 సంవత్సరాల క్రితం నిజామాబాద్ పట్టణం కు చెందిన అరవింద్ తో పెళ్లి జరిగింది. ఇద్దరు పిల్లలు. కుటుంబ కలహాలతో గత కొన్ని నెలలుగా ఇద్దరు పిల్లలతో మృతురాలు దివ్యవాణి భిక్కనూరు లోని తల్లి గారి ఇంటి వద్ద నివాసం ఉంటుంది. ఈనెల 11న ఇల్లు, పిల్లలు వదిలి బాధితురాలు బయటకు వెళ్ళింది.తిరిగి రాలేదు. తండ్రి మధు బిక్కనూర్ పోలీసులు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు అయింది. ఆదివారం నాడు జంగంపల్లి శివారులో దివ్యవాణి పై యాసిడ్ దాడి జరిగిందని గాయపడిందని పోలీసులకు సమాచారం రాగా పోలీసులు కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలీ పరిస్థితి విషమంగా ఉండడంతో సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి మెరుగైన చికిత్స కోసం తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం నాడు మృతురాలు దివ్యవాణి చనిపోయింది. కాగా తండ్రి మధు తన కూతురుని భర్త అరవింద్, కుటుంబ సభ్యులు దాడి చేశారని చావుకు వారే కారణమని ఫిర్యాదు చేశారు. దివ్యవాణి మృతి అనుమానాస్పదం కావడంతో కామారెడ్డి డిఎస్పి మధుసూదన్ స్వయంగా కేసును దర్యాప్తు చేస్తున్నారు. తన కూతురు చావుకు అత్తవారు, భర్త కుటుంబ సభ్యులు కారణమని తండ్రి మధు ఫిర్యాదు చేశారు. కామారెడ్డి డిఎస్పి మధుసూదన్ కేసు విచారణ జరుపుతున్నారు.

మసీదులో గణపతి..గుండెల్లో మానవత్వం!

- 45 ఏళ్లుగా కొనసాగుతున్న మత సామరస్య సంప్రదాయం
- మతాలు వేరు కావచ్చు... మనసులు మాత్రం ఒక్కటే





ప్రజా వాయిస్ , హుజూర్ నగర్,సెప్టెంబర్ 14: మతాల పేరుతో సమాజంలో విభేదాలు తలెత్తుతున్న నేటి పరిస్థితుల్లో.. మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లా వాల్వా తాలూకా గోట్‌ఖిండీ గ్రామం మత సామరస్యానికి సజీవ నిదర్శనంగా నిలుస్తోంది. హిందూ,ముస్లింలు కలిసి గణేష్ ఉత్సవాలను నిర్వహిస్తూ, పరస్పర మత విశ్వాసాలను గౌరవిస్తూ ముందుకు సాగుతున్న తీరు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. గ్రామంలోని మసీదులో గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహించడం గోట్‌ఖిండీ ప్రత్యేకత. ఈ సంప్రదాయం సుమారు నాలుగు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్నట్లు వార్తా నివేదికలు పేర్కొంటున్నాయి. 1980 ప్రాంతంలో భారీ వర్షాల కారణంగా గణపతి విగ్రహాన్ని సురక్షితంగా ఉంచేందుకు స్థానిక ముస్లిం పెద్దలు మసీదులోకి తీసుకెళ్లాలని సూచించడంతో ఈ సంప్రదాయానికి నాంది పలికినట్లు స్థానికుల కథనం.

పూజలోనూ.. సేవలోనూ కలిసే అడుగులు

గణేష్ ఉత్సవాల సమయంలో హిందువులతో పాటు ముస్లిం కుటుంబాలు కూడా ఉత్సవ ఏర్పాట్లలో భాగస్వాములు కావడం ఈ గ్రామ ప్రత్యేకత. ప్రసాదం తయారీ, ఏర్పాట్లు, ఇతర కార్యక్రమాల్లో రెండు వర్గాల ప్రజలు కలిసి పాల్గొంటున్నట్లు పలు నివేదికలు వెల్లడించాయి.పండుగ ఏదైనా.. ఆనందం మాత్రం అందరిదేనన్న భావన గ్రామ ప్రజల్లో బలంగా కనిపిస్తోంది. గణేష్ ఉత్సవాలతో పాటు ఈద్, మొహరం, దీపావళి వంటి పండుగలను కూడా పరస్పర గౌరవంతో జరుపుకోవడం గ్రామ సామాజిక జీవనంలో భాగంగా మారింది.

మతం వేరు.. మనసులు ఒక్కటే

గోట్‌ఖిండీ కథ ఒక మతానికి సంబంధించిన వేడుకను మరో మతం అంగీకరించడమే కాదు. ఒకరి విశ్వాసాన్ని మరొకరు గౌరవిస్తే.. మతాల మధ్య గోడలు కూలిపోతాయని చెప్పే సామాజిక సందేశం. దేశంలో మత సామరస్యం, సామాజిక ఐక్యతపై చర్చ జరుగుతున్న వేళ గోట్‌ఖిండీ ప్రజల ఆచరణ ప్రత్యేకంగా నిలుస్తోంది. మతాలు వేరు కావచ్చు.. ఆచారాలు వేరు కావచ్చు.. కానీ మనుషుల మధ్య ప్రేమ, గౌరవం, సహజీవనం ఉంటే అదే నిజమైన భారతీయత అని ఈ గ్రామం చాటి చెబుతోంది.




నీరు ఉబుకుతోంది.. అధికారులు ఉలకడం లేదు?

- భగీరథ నీరా.. భూగర్భ అద్భుత జలమా? అధికారులే తేల్చాలి!
- నెలలుగా రహదారిపై ఉబికి వస్తున్న నీరు.. పట్టించుకోని అధికారులు!
- లీకేజీ ఎక్కడో గుర్తించకుండానే వృథాగా పోతున్న విలువైన నీరు?

ప్రజా వాయిస్, ఖమ్మం:ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకం నిర్వహణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాచేపల్లి నుంచి మంగాపురం వెళ్లే ప్రధాన రహదారిపై గత రెండు నెలలుగా ఎలాంటి వర్షం లేకపోయినా నీరు ఉబికి వస్తుండటంతో.. రహదారి కిందుగా వెళ్లే మిషన్ భగీరథ పైప్‌లైన్‌లో లీకేజీ ఏర్పడిందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే నీరు ఎక్కడి నుంచి వస్తుందో సంబంధిత అధికారులు ఇప్పటివరకు స్పష్టంగా గుర్తించకపోవడం గమనార్హం.రహదారి మధ్యలో నుంచి నిరంతరం నీరు బయటకు వస్తుండటంతో విలువైన నీరు వృథాగా ప్రవహిస్తోంది. నీటి ప్రవాహం కారణంగా రహదారి తడిసి ఉండటంతో పాటు, సమీప ప్రాంతాలకు నీరు చేరుతోంది. దీనిపై సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నీటి మూలాన్ని గుర్తించి చర్యలు తీసుకోవాల్సి ఉన్నా.. రెండు నెలలుగా పరిస్థితిలో మార్పు లేకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు రోడ్డుపైకి వస్తున్న నీటిని కొందరు రైతులు తమ పంట పొలాలకు మళ్లించుకుంటున్నారు. తాగునీటి సరఫరా కోసం వినియోగించే నీరే ఇలా రోడ్డుపైకి వచ్చి సాగునీటిగా మారుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇది నిజంగా మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ అయితే.. నీటి వృథాతో పాటు రహదారి భద్రతపైనా అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.రోడ్డుపై నీరు ఎక్కడి నుంచి వస్తోంది? పైప్‌లైన్ లీకేజీనా.. మరేదైనా కారణమా? అన్నది సంబంధిత అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నీటి మూలాన్ని గుర్తించి, నిజంగా పైప్‌లైన్ లీకేజీ ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

క్షణిక ఆనందం..!! జీవితాంతం వెంటాడే విషాదం

- అపరిచితులతో స్నేహాలతో..!! ఆగమవుతున్న జీవితాలు.



ప్రజా వాయిస్ హైదరాబాద్ డెస్క్..ఇన్‌స్టాగ్రామ్ పరిచయం ఓ మైనర్ బాలికను కాటేసింది. ఆమె జీవితాన్ని అస్తవ్యస్తం చేసింది. ఎత్తుకెళ్లి మూడు రోజులపాటు నగరం మొత్తం తిప్పారు. మత్తు మందు కలిపిన చాక్లెట్లు తినిపించడంతో పాటు, మద్యం, గంజాయి, సిగరెట్లు తాగించి యువకులు ఆమె పట్ల అమానుషంగా ప్రవర్తించారు...ఒకరి తర్వాత ఒకరు లైంగిక దాడికి పాల్పడ్డారు. చివర్లో ఎలాగో తప్పించుకుని బయటపడిన ఆమె ఇంటికి చేరుకుని కుటుంబసభ్యులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో ఈ ఘోర సామూహిక అత్యాచారాల పరంపర వెలుగులోకి వచ్చింది...అల్వాల్‌కు చెందిన ఓ బాలిక ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం చదువుతోంది. 10వ తరగతి చదువుతున్నప్పుడు జెర్రీ వరుణ్ అనే యువకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం అయ్యాడు. ఈ క్రమంలో అతనితో స్నేహం ఏర్పడింది. దీన్ని ఆసరాగా తీసుకున్న వరుణ్ ఓ రోజు కారులో తీసుకెళ్లి మత్తు మందు కలిపిన చాక్లెట్లు తినిపించాడు. ఆమె మత్తులోకి వెళ్లడంతో కారులోనే పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత జెర్రీ వరుణ్ పరిచయం చేసిన మరో వ్యక్తి రోమల వరుణ్ బాధితురాలితో పరిచయం పెంచుకున్నాడు. ఆమెకు మద్యం, సిగరెట్లు, గంజాయి అలవాటు చేశాడు. ఈ క్రమంలో బాలికను కొంపల్లిలోని ఓ నిర్మానుష్య మైన ప్రాంతానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. కాగా ఈ నెల 9న కూతురి వ్యవహార శైలిని ప్రశ్నించిన ఆమె తండ్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో ఆ బాలిక అలిగి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది.నేరుగా బొల్లారం రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. అక్కడికి రమ్మని తనకు పరిచయస్తుడైన నీరజ్ అనే యువకుడిని పిలిచింది. అతను తన స్నేహితుడైన విక్కీని స్టేషన్‌కు రమ్మని చెప్పాడు. ఇద్దరూ కలిసి బాలికతో గంజాయి కలిపిన సిగరెట్లు తాగించడంతో ఆమె మత్తులోకి జారుకుంది. ఆమెను స్టేషన్‌కు సమీపంలోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లారు. అక్కడ నీరజ్ ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. తర్వాత ఆమెను ఇంటికి తీసుకెళ్లిన విక్కీ అక్కడ ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. తర్వాత విక్కీ తన స్నేహితుడైన నిఖిల్‌తో కలిసి బాధితురాలిని స్కూటర్‌పై ఎక్కించుకుని దూలపల్లికి తీసుకెళ్లాడు. అక్కడ అప్పటికే ఉన్న ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులతో కలిసి నల్లటి నూనె లాంటి పదార్థాన్ని సిగరెట్‌లోకి ఎక్కించి బలవంతంగా తాగించారు. తర్వాత సమీపంలోని ఓయో రూమ్‌కు తీసుకెళ్లి అక్కడ గంజాయి తాగించారు. అక్కడ నిఖిల్ ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు లైంగిక దాడి చేశారు. తర్వాత హోటల్ రూమ్ నుంచి బాలికను బొల్లారంలోని విక్కీ ఇంటికి తీసుకువచ్చారు. అక్కడ విక్కీతో పాటు నిఖిల్ మళ్లీ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఆమె సెల్‌ఫోన్ లాక్కొని అక్కడే బంధించారు.

ఒకసారి తప్పించుకున్నా వెంటాడి..!!

ఈ నెల 10న మైనర్ బాలిక అక్కడ్నుంచి తప్పించుకొని బొల్లారం రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. అయితే ఆమెను వెంటాడిన విక్కీ, తన స్నేహితుడు గణేష్‌తో పాటు అక్కడికి చేరుకున్నాడు. మళ్లీ ఆమెకు గంజాయి తాగించారు. రైల్లో మేడ్చల్ తీసుకెళ్లారు. అప్పటికే అక్కడ నిలిచి ఉన్న రైలు బోగీలోకి తీసుకెళ్లి విక్కీ, గణేష్ ఇద్దరూ ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డారు. ఆ తర్వాత ముగ్గురూ కలసి మరో రైలులో మల్కాజిగిరి వైపు వెళ్తుండగా బాలిక ఇతరుల సహాయంతో తప్పించుకోవడానికి ప్రయత్నించింది. కానీ ఆమెను ఆటోలో ధూల్‌పేట వైపు తీసుకెళ్లారు. అయితే ఆమె గట్టిగా కేకలు వేయడంతో మధ్యలోనే పదిలేసి పారయ్యారు. అనంతరం మరో ఆటోలో ఇంటికి చేరుకున్న బాలిక కుటుంబసభ్యులకు విషయం చెప్పింది. దీంతో బాలికతో కలిసి కుటుంబసభ్యులు అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు జెర్రీ వరుణ్, రోమల వరుణ్, నీరజ్, విక్కీ, నిఖిల్, గణేష్, ఇతరులను అదుపులోకి తీసుకుని విచారించారు.

9 మంది అరెస్ట్ ..!!

బాలికపై సామూహిక అత్యాచారం కేసులో.. ఇప్పటికే తొమ్మిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వాళ్లందరిపైనా పోక్సో చట్టం కింద కేసులు పెట్టారు. ఈ కీచక పర్వానికి సహకరించిన మరో నలుగురి కోసం గాలింపు చేపట్టారు. ★పిల్లల సోషల్ మీడియా కదలికలపై, నడవడికపై తల్లిదండ్రులు నిరంతరం నిఘా ఉంచాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరిస్తున్నారు.

అదుపుతప్పిన కంటైనర్

- బీభత్సం సృష్టించిన సెవెన్ హిల్స్ ట్రావెల్స్ బస్సు
- విద్యుత్ స్తంభం కూలి బస్సుపై పడటంతో వరుస ప్రమాదాలు
- కారు దిగిన యువకుడిని "ఢీ"కొట్టిన బస్సు
- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి



ప్రజా వాయిస్/ రాజేంద్రనగర్: శంషాబాద్‌లో సోమవారం తెల్లవారుజామున వరుస రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. కంటైనర్,డివైడర్‌పై ఉన్న విద్యుత్ స్తంభాన్ని "ఢీ"కొట్టడంతో అది కూలి సెవెన్ హిల్స్ ట్రావెల్స్ బస్సుపై పడింది.అనంతరం బస్సు వరుసగా వాహనాలను"ఢీ"కొంటూ హోటల్,పాన్‌షాప్‌ను లోకి దూసుకెళ్లింది.ఈ ఘటనలో 29 ఏళ్ల యువకుడు మృతి చెందగా,పలువురికి గాయాలయ్యాయి.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. కరీంనగర్‌కు చెందిన మహ్మద్ మొహియుద్దీన్ కుటుంబంతో కలిసి ఎర్టిగా కారులో కరీంనగర్ నుంచి ఆర్జీఐ విమానాశ్రయానికి బయలుదేరారు.ఉదయం 5.50 గంటల సమయంలో కింగ్స్ రెస్టారెంట్ సమీపంలో టీ తాగేందుకు కారు నిలిపారు.ఆయన కుమారుడు మహ్మద్ అజీదుద్దీన్(29)టిఫిన్ కోసం కారు దిగాడు.అదే సమయంలో బాచుపల్లి వైపు వెళ్తున్న సెవెన్ హిల్స్ ట్రావెల్స్ బస్సు,కారు, అజీదుద్దీన్‌ను"ఢీ"కొట్టింది. అంతటితో ఆగకుండా అక్కడ నిలిపి ఉన్న స్విఫ్ట్ డిజైర్,మారుతి ఈకో,రెండు ద్విచక్ర వాహనాలను వరుసగా "ఢీ"కొట్టిన బస్సు బాలాజీ భవన్ హోటల్, పాన్‌షాప్ లోకి దూసుకెళ్లింది.ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అజీదుద్దీన్‌ను శంషాబాద్‌లోని సన్‌రైజ్ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.సాదిక్ పాషా(34)తో పాటు పలువురికి గాయాలయ్యాయి.బెంగళూరు వైపు వెళ్తున్న ఐచర్ కంటైనర్ డివైడర్‌పై ఉన్న విద్యుత్ స్తంభాన్ని "ఢీ"కొట్టడంతో స్తంభం బస్సుపై పడినట్లు పోలీసులు తెలిపారు. దీంతో బస్సు అదుపుతప్పి వరుసగా వాహనాలు, హోటల్,పాన్‌షాప్ లోకి దూసుకెళ్లినట్లు వెల్లడించారు.ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా వాయిస్ ఎఫెక్ట్!సీ రోడ్డుకు క్యూరింగ్ మాయ,అనే శీర్షికకు స్పందన

- కాంట్రాక్టర్ ది పని' అధికారుల పర్యవేక్షణ వద్దా.?
- తూతూమంత్రంగా తనిఖీలు నెల క్రితమే రోడ్డు,క్యూరింగ్ పూర్తయిందంటున్న ఇంజనీరింగ్ అధికారులు



ప్రజా వాయిస్/రాజేంద్రనగర్: ప్రజాధనంతో రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలో చేపడుతున్న సీసీ రోడ్డు పనుల్లో కాంట్రాక్టర్‌ది పని, ఇంజనీరింగ్ అధికారులది పర్యవేక్షణ.కానీ పర్యవేక్షణే తూతూమంత్రంగా మారితే నాణ్యతను కాపాడేది ఎవరు.? అన్న ప్రశ్నలు సర్కిల్ పరిధిలో తీవ్రంగా వినిపిస్తున్నాయి.హైదర్‌షాకోట్‌లోని గంధంగూడ–బైరాగిగూడ రహదారి సీసీ రోడ్డు పనులపై ప్రజా వాయిస్ కథనం వెలువడిన తర్వాత ఇంజనీరింగ్ అధికారులు స్పందించారు.రోడ్డు నెల రోజుల క్రితమే పూర్తయిందని,క్యూరింగ్ కూడా అప్పుడే నిర్వహించామని అధికారులు చెబుతున్నారు.అయితే పనులు జరుగుతున్న సమయంలో అధికారులు క్షేత్రస్థాయిలో ఎంతమేర పర్యవేక్షించారన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్న.కాంట్రాక్టర్ల నుంచి అధికారులు,సిబ్బందికి అమ్యామ్యాలు అందుతున్నాయనే ఆరోపణలు స్థానికంగా బలంగా వినిపిస్తున్న నేపథ్యంలో ఇవి కేవలం ఆరోపణలేనా.? లేక ఎక్కడైనా వాస్తవాలున్నాయా.? అన్నది ఉన్నతాధికారుల విచారణతో తేలాల్సి ఉంది. కాంట్రాక్టర్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాల్సిన అధికారులు,పనులు పూర్తయ్యే వరకు కఠినంగా పర్యవేక్షించాల్సిన బాధ్యత కలిగి ఉంటారు.అలాంటిది ఎక్కడా కూడా ఉన్నతాధికారులు పనుల పర్యవేక్షణ చేపట్టకపోవడంపై మరింత బలమైన అనుమానాలు ప్రజల్లో రైతేస్తున్నాయి.కిస్మత్‌పూర్,బండ్లగూడ, హైదర్‌షాకోట్ పరిధిలోనూ సీసీ రోడ్డు పనుల నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంట్రాక్టర్ ఇచ్చే ప్రయోజనాల కోసం పర్యవేక్షణను పక్కన పెడుతున్నారనే ఆరోపణలకు అధికారులు ఏం సమాధానం చెబుతారు.? అన్నది చర్చనీయాంశంగా మారింది.క్యూరింగ్ చేశామంటే సరిపోదు' పర్యవేక్షణ ఆధారాలు చూపాలి.మూడు డివిజన్లలో పూర్తయిన సీసీ రోడ్డు పనులపై ఉన్నతాధికారులు సాంకేతిక పరిశీలన చేపట్టి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. క్యూరింగ్ వివరాలు, నాణ్యత పరీక్షలు, అధికారుల తనిఖీ నివేదికలు,కాంట్రాక్టర్‌కు సంబంధించిన పనుల రికార్డులను పరిశీలిస్తే ఆరోపణల్లో వాస్తవమెంతో బయటపడుతుందని అంటున్నారు.పనుల్లో పర్యవేక్షణ చేపట్టకుండా కాంట్రాక్టర్ ముట్టజెప్పే అమ్యామ్యాలకు అలవాటు పడి ప్రజాధనాన్ని బూడిదలో పోస్తున్నారని అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాధనం ఖర్చు చేస్తున్నప్పుడు అనుమానాలకు తావు లేకుండా,పనుల నాణ్యత,పర్యవేక్షణపై పూర్తి పారదర్శకత పాటించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



బ్రహ్మోత్సవాల వేళ,,, భక్తుల జేబులకు చిల్లు

- అధికారుల ఆదేశాలు బేఖాతర్
- రూ 40 కొబ్బరికాయ రూ50కి
- నాసిరకం కొబ్బరికాయల విక్రయాలపై భక్తుల ఆగ్రహం



పటాన్ చెరువు ప్రజావాయిస్ ప్రసిద్ధ రుద్రారం గణేష్ గడ్డ వినాయక స్వామి దేవాలయంలో వినాయక చవితి బ్రహ్మోత్సవాల సందర్భంగా కొందరు వ్యాపారస్తులు అధికారుల ఆదేశాలను బేకాతరు చేస్తూ 40 రూపాయలకు అమ్మవలసిన కొబ్బరికాయలను 50 రూపాయలకు విక్రయిస్తూ భక్తుల జేబులను గుల్ల చేస్తున్నారు భక్తుల నుంచి ఫిర్యాదులు అందిన అధికారులు స్పందించడం లేదని పలువురు భక్తులు వాపోయారు అధికారులు నిర్ణయించినటువంటి ధరల కంటే అధికంగా నాణ్యత లేనటువంటి కొబ్బరి కాయలను విక్రయిస్తూ కొందరు వ్యాపారులు అధికారుల నిబంధనలను పాటించకుండా నాణ్యత సరిగ్గా లేని కొబ్బరికాయలను విక్రయిస్తున్నారని తెలిపారు అంతేకాకుండా నాసిరకం తల్లి నా కొబ్బరి కారిన సైతం భక్తులకు అంటగడుతున్నారని పలువురు వాపోయారు దైవ దర్శనంతో వచ్చిన భక్తుల నుంచి అధికారులు కేటాయించిన ధరల కంటే ఎక్కువ వసూలు చేయడం ఎంతవరకు సమాచారమని పలువురు భక్తులు ప్రశ్నిస్తున్నారు అధికారుల ఆదేశాలను పట్టించుకోకుండా ధరలో నాణ్యత విషయంలో జాగ్రత్తలు పాటించాలని ఆలయ అధికారులు సూచించిన క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగ వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి అధికారుల హెచ్చరికలు జారీ చేయడమే కాకుండా నిబంధనలు ఉల్లంఘిస్తున్న దుకాణాలపై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు వినాయక బ్రహ్మోత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో కొబ్బరికాయల ధరలో నాణ్యత పై అధికారులు ప్రత్యేక నిగా పెట్టాలని పలువురు భక్తులు డిమాండ్ చేస్తున్నారు ధరలను బహిరంగంగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవడంతో పాటు అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు లేదా నర్సీ రకం చేస్తున్నట్లు నిర్ధారణ నిర్ధారణ అయితే సంబంధిత వ్యాపారులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని పలువురు భక్తులు అధికారులకు విన్నపిస్తున్నారు

నిరుపయోగంగా చేపల మార్కెట్ భవనం వినియోగంలోకి వచ్చేనా?.

- మందుబాబులకు అడ్డాగా భవనం
- 10 లక్షల రూపాయలతో నిర్మాణం.
- వినియోగంలోకి తీసుకురావాలంటున్న స్థానికులు

జిన్నారం ప్రజావాయిస్ పది లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన చేపల మార్కెట్ భవనం నేడు మందుబాబులకు అడ్డాగా మారింది మండల కేంద్రమైన జిన్నారంలో శివాజీ స్టేడియం పక్కన సుమారు 10 లక్షల రూపాయలతో భవనం నిర్మించారు జిన్నారం మండల మత్స్యకారులకు చేపల విక్రయించడానికి మత్స్య శాఖ ఆధ్వర్యంలో సర్వే నెంబర్ ఒక వెయ్యి రెండు లో 2018లో పటాన్చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు భవనం నిర్మించడానికి మత్స్య శాఖ నుండి భవన నిర్మాణానికి 10 లక్షల రూపాయలు కేటాయించారు 2023 సెప్టెంబర్ లో భవనాన్ని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు చేపల విక్రయ దారులను ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు మత్స్యకారులకు మరింత ఆదరణ గౌరవం లభించే విధంగా భవనం నిర్మించారు భవనం నిర్మించి దాదాపు మూడు సంవత్సరాలు గడుస్తున్న వినియోగంలోకి రాకపోవడం మత్స్యకారుల అభ్యున్నతికి ఉన్నత స్థితికి చేర్చేలా భవనాన్ని నిర్మించారు రెండు నుంచి మూడు సంవత్సరాల కాలం గడుస్తున్నా భవనం కొందరు మందుబాబులు అడ్డాగా చేసుకొని భవనాన్ని తమ అడ్డాగా మార్చుకున్నారు దీంతోపాటు ప్రతి బుధవారం ఆదివారం జిన్నారం ప్రధాన రహదారి పైన మత్స్యకారులు చేపల విక్రయాలు కొనసాగిస్తున్నారు ఇకనైనా అధికారులు స్పందించి 10 లక్షల రూపాయలతో నిర్మించిన భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని మండలంలోని పలు గ్రామాల ప్రజలు అంటున్నారు జిల్లా మత్స్యశాఖ అధికారులు స్పందించి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని భవనం దాదాపుగా శిథిలావస్థ చేరుకునే స్థితిలో ఉందని స్థానికులు వాపోతున్నారు జిల్లా మత్స్యశాఖ అధికారులు స్పందించి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని మండలంలోని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు



టెలికాం వైర్ల చోరీ ముఠా గుట్టు రట్టు

- 8 మంది రిమాండ్



ప్రజా వాయిస్/ మంచిర్యాల క్రైమ్ మంచిర్యాల్ జిల్లా కేంద్రంలో బెల్లంపల్లి రూరల్ సర్కిల్ పరిధిలో ప్రభుత్వ రంగానికి చెందిన బీఎస్ఎన్ఎల్ టవర్ల కాపర్ వైర్లను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో మొత్తం 8 మంది నిందితులను అదుపులోకి తీసుకుని, సోమవారం న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా.. కోర్టు వారిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించింది.రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాలు, మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ పర్యవేక్షణ, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్ విజయవంతమైంది. సాంకేతిక ఆధారాలు, పక్కా సమాచారంతో పోలీసులు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.ఉప్పరి సంపత్, గొమాసా అజయ్ కృష్ణ, మారినేని రాజ్‌కుమార్, గొమాసా అనుకృష్ణ, దుర్గం శేఖర్, దుర్గం అంకులు, పాండి రాజ్‌కుమార్, సాంబోజు రమేష్‌లను నిందితులుగా గుర్తించారు.ఈ ముఠాకు సంబంధించిన గత నేర చరిత్ర, ఇతర ప్రాంతాల్లో జరిగిన ఇలాంటి చోరీ కేసులతో ఉన్న సంబంధాలపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టారు. నిందితులపై గ్యాంగ్ వైళ్లు, సస్పెక్ట్ షీట్లు తెరిచి భవిష్యత్తులోనూ కఠిన నిఘా ఉంచనున్నట్లు అధికారులు వెల్లడించారు. టెలికాం మౌలిక వసతులు, ప్రభుత్వ ఆస్తులకు విఘాతం కలిగించే వారిపై ఉపేక్షించేది లేదని, భవిష్యత్తులోనూ కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.ఈ కేసును ఛేదించడంలో ఏసీపీ సీసీఎస్ కె. రవికుమార్, సీఐ సీసీఎస్ టి. గోపీ, బెల్లంపల్లి రూరల్ సీఐ సీహెచ్. హనోక్, ఎస్సై సీసీఎస్ భాస్కర్ రావు, తల్లగురిజాల ఎస్సై రామకృష్ణతో పాటు సబ్‌డివిజన్ పోలీస్ సిబ్బంది, సీసీఎస్ ప్రత్యేక బృందాలు సమన్వయంతో ప్రతిభ కనబరిచాయి.

ఆనాడు స్కూటీ.. ఈనాడు ఖరీదైన కార్లు

- లెక్క తేల్చుకుందామా.. మాజీ ప్రజాప్రతినిధులపై సంచలన సవాల్
- గత పాలనలో అవినీతి, అక్రమాలను ఆధారాలతో బయటపెడతాం
- మాక్ అసెంబ్లీ పెట్టి ప్రతిపక్షాలు నవ్వులపాలయ్యారు
- ప్రజలు నవ్వుతుండ్రు
- సీఎం రేవంత్ రెడ్డి మాటయిచ్చిండు.. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం
- రెండేళ్లలో మిర్యాలగూడ రూపురేఖలు మారుస్తాం
- గణేష్ ఉత్సవ కమిటీలకు రూ.5,116 చొప్పున ఆర్థిక సాయం
- మిర్యాలగూడ శాసనసభ్యులు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి.



ప్రజా వాయిస్,మిర్యాలగూడ: మాజీ ప్రజాప్రతినిధుల ఆస్తులు, గత పాలకుల హయాంలో జరిగిన అభివృద్ధి పనులు, కాంట్రాక్టులు, బిల్లులు, భూముల వ్యవహారాలపై బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సవాల్ విసిరారు. మీరు మిర్యాలగూడకు వచ్చినప్పుడు మీ పరిస్థితి ఏంటి.. ఈరోజు మీరు తిరుగుతున్న కార్ల పరిస్థితి ఏంటి.. ఆనాడు పనికిమాలిన స్కూటీపై వచ్చిన మీరు.. ఈరోజు ఎలా ఉన్నారు..అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో లక్ష్మారెడ్డి మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని, రాబోయే రెండేళ్లలో మిర్యాలగూడ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.

మాక్ అసెంబ్లీతో నవ్వులపాలు

అసెంబ్లీలో ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేయడం వారి హక్కేనని, నల్ల దుస్తులు ధరించి రావడాన్ని తాము తప్పుపట్టడం లేదని ఎమ్మెల్యే అన్నారు. అయితే నల్ల దుస్తులపై ఫ్లకార్డులు రాసుకుని సభా కార్యక్రమాలకు ఆటంకం కలిగించడం, ప్రజా సమస్యలపై చర్చను పక్కదారి పట్టించడం సరికాదన్నారు. దేశ చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా మాక్ అసెంబ్లీ ఏర్పాటు చేసి ప్రజల ముందు ప్రతిపక్షాలు నవ్వులపాలయ్యాయని విమర్శించారు.దళితులు నడిచిన రోడ్డును పసుపుతో కడిగిన ఘటనను ప్రస్తావిస్తూ.. ఇలాంటి దుర్మార్గమైన చర్యను ఎక్కడా చూడలేదని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని మండిపడ్డారు..జాతిపిత కుమారుడు..అగ్గిపెట్టె రావు.. అంటూ ప్రతిపక్ష నేతలపై విమర్శలు చేసిన ఎమ్మెల్యే.. వారిపై కేసులు పెట్టడం ప్రభుత్వానికి పెద్ద విషయం కాదన్నారు. అయినప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో ఓపికతో ప్రతిపక్ష నాయకులు, సభ్యులను గౌరవిస్తూ వ్యవహరిస్తున్నారని తెలిపారు.

ఆనాడు స్కూటీ.. ఈనాడు కార్లు..

మాజీ ప్రజాప్రతినిధులను ఉద్దేశించి ఎమ్మెల్యే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మిర్యాలగూడకు వచ్చిన నాటి పరిస్థితులు, ప్రస్తుతం వారి ఆస్తులు, జీవన విధానంలో వచ్చిన మార్పులపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు, వాటి బిల్లులు, కాంట్రాక్టులు, భూముల వ్యవహారాలపై చర్చకు రావాలని కోరారు.డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనులు తామే చేశామని, వాటికి సంబంధించిన బిల్లులను గత పాలకులు తీసుకున్నారని ఆరోపించారు. కళావేదిక, మార్కెట్‌కు సంబంధించిన బిల్లుల్లోనూ బినామీ పేర్లతో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత మాజీ ప్రజాప్రతినిధులు స్పందించాల్సి ఉంది.

ఒక్కో వ్యవహారం బయటకు తీస్తాం

బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు దొందూ దొందేనని ఎమ్మెల్యే విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు, హైదరాబాద్ భూముల వ్యవహారాలపై కేంద్ర ప్రభుత్వం సీబీఐ విచారణ జరిపించి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు.యాదాద్రి పవర్‌ప్లాంట్, కల్యాణలక్ష్మి తదితర వ్యవహారాల్లో భారీ అవినీతి జరిగిందని ఆయన ఆరోపించారు. పవర్‌ప్లాంట్‌కు సంబంధించిన భూముల విషయంలో బినామీ పేర్లతో రిజిస్ట్రేషన్లు చేసి వందల కోట్ల రూపాయలు కొల్లగొట్టారని ఆరోపించారు. ఉద్యోగాల విషయంలోనూ అక్రమాలు జరిగాయని అన్నారు. క్వారీలు, క్రషర్లు, బినామీ కాంట్రాక్టులు, భూముల వ్యవహారాలకు సంబంధించిన వివరాలను త్వరలోనే ప్రజల ముందుంచుతామని హెచ్చరించారు.దున్నపోతులగండి, కొండ్రపోల్ ప్రాంతాల అభివృద్ధి పనులు గత ప్రభుత్వ హయాంలో కాగితాలకే పరిమితమయ్యాయని, నిధులు విడుదల కాలేదని ఆరోపించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

మిర్యాలగూడ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రజల కోసం పనిచేస్తోందని ఎమ్మెల్యే అన్నారు. ప్రజా ప్రభుత్వంలో దళారీ వ్యవస్థను రద్దు చేసి నేరుగా లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.మిర్యాలగూడలో సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డులు, ట్యాంక్ బండ్, చిన్నచెరువు సుందరీకరణ వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. అమృత్ పథకం ద్వారా రాబోయే 25 ఏళ్ల వరకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కొత్త బస్టాండ్, ఏటీసీ సెంటర్, పాలిటెక్నిక్ కళాశాల పనులు త్వరలో ప్రారంభమవుతాయని వెల్లడించారు.రూ.9.5 కోట్లతో నిర్మిస్తున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను త్వరలో ప్రారంభిస్తామని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యా వ్యవస్థను తీర్చిదిద్దడమే లక్ష్యమని అన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం 22 ఎకరాల స్థలాన్ని సేకరించి నమూనాలను సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేశామని తెలిపారు.

గణేష్ ఉత్సవ కమిటీలకు రూ.5,116

గణేష్ ఉత్సవాల సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఉత్సవ కమిటీలు, నిర్వాహకులు సహకరించాలని సూచించారు..కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, కౌన్సిలర్లు, బీఎల్ఆర్ బ్రదర్స్ తరఫున నియోజకవర్గంలోని ప్రతి గణేష్ ఉత్సవ కమిటీకి రూ.5,116 చొప్పున అందజేస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు.తాను ప్రతిరోజూ ప్రజలకు అందుబాటులో ఉంటానని, తనకు బినామీలు, దళారీలు, కాంట్రాక్టర్ల వ్యవస్థ లేదని బత్తుల లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. గతంలో జరిగిన అవినీతి, అక్రమాలపై పూర్తి వివరాలను త్వరలోనే ప్రజల ముందుంచుతామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ తప్పకుండా అమలు చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు, సర్పంచులు,కౌన్సిలర్లు, బీఎల్ఆర్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు..

మూసీ గేట్లు ఎత్తే అవకాశం!

- నదీ పరివాహక గ్రామాలకు అత్యవసర హెచ్చరిక
- ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు
- 5,200 క్యూసెక్కుల వరద ప్రవాహం
- మూసీ పరివాహక ప్రాంత ప్రజలు నదిలోకి వెళ్లొద్దని అధికారుల సూచన



ప్రజా వాయిస్,సూర్యాపేట.ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మూసీ రిజర్వాయర్‌కు వరద ప్రవాహం కొనసాగుతోంది. రిజర్వాయర్‌కు వస్తున్న వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉండటంతో అవసరమైన సమయంలో మూసీ రిజర్వాయర్ గేట్లను ఎత్తే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ అధికారులు అత్యవసర హెచ్చరిక జారీ చేశారు.మూసీ రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం (FRL) 645 అడుగులు కాగా, ప్రస్తుతం 638.30 అడుగుల నీటిమట్టం నమోదైంది. రిజర్వాయర్ మొత్తం 4.46 టీఎంసీల నిల్వ సామర్థ్యానికిగాను ప్రస్తుతం 2.84 టీఎంసీల నీరు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. గత 24 గంటల్లో రిజర్వాయర్‌కు 5,200 క్యూసెక్కుల వరద ప్రవాహం నమోదైనట్లు తెలిపారు.

నదిలోకి వెళ్లొద్దు

వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా అవసరమైన సమయంలో రిజర్వాయర్ గేట్లు తెరవనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో మూసీ నది పరివాహక ప్రాంతంలోని ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ నదిలోకి వెళ్లవద్దని, నది పరిసర ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించారు. అధికారుల హెచ్చరికలను నిర్లక్ష్యం చేయకుండా భద్రతా చర్యలు పాటించాలని కోరారు.

సూర్యాపేట జిల్లాలో.. ప్రభావిత మండలాలు:

సూర్యాపేట, పెన్‌పహాడ్, పాలకీడు.ప్రభావిత గ్రామాలు: రత్నాపురం, రామవరం, హనుమాన్ తండా, వెంకట్రాంపూర్ టేకుమట్ల, నండ్యాలగూడెం, కొంకతిమ్మని అన్నారం, సర్కిల్‌పేట, కాసరాబాద్, అనాజిపురం, అసంతారం, దోసపహాడ్, సజ్జాపురం, గంటవారిగూడెం, ఎల్లారం, సోమవరం, చింతకుంట్ల, పులగంబండ తండా, మూసీ ఒడ్డు సింగారం, ఎల్లాపురం, శూన్యపహాడ్.

నల్గొండ జిల్లాలో.. ప్రభావిత మండలాలు:

కేతేపల్లి, మాడుగులపల్లి, మిర్యాలగూడ.ప్రభావిత గ్రామాలు: బొప్పారం, కాసనాగోడ్, చికటిగూడెం, కొత్తపేట, ఉప్పలపహాడ్, కొప్పోలు, భీమారం, ఆమనగల్, లక్ష్మీదేవిగూడెం, రావులపెంట, రాజాపేట, నర్సింహుల గూడెం, తక్కెళ్లపాడు, కాల్వపల్లి, ఆళ్లగడప, రాయని పాలెం, ములకల కాల్వ, కేశవాపురం, తుంటుకుంటవిల్ల, వాడపల్లి, వజీరాబాద్.సంబంధిత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు జారీ చేసే సూచనలు, భద్రతా మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని నీటిపారుదల శాఖ అధికారులు కోరారు. ప్రజల భద్రత దృష్ట్యా నది పరివాహక ప్రాంతాల్లో అనవసరంగా సంచరించవద్దని సూచించారు.

ప్రేమ పేరుతో పిలిచి.. ప్రాణం తీశాడు

- పెళ్లి చేసుకుంటానని నమ్మించి బళ్లారికి రప్పించిన ప్రియుడు
- పరువు పోతుందనే భయంతో హత్యకు పక్కా స్కెచ్
- మహిళను చంపి.. మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా నరికిన వైనం
- ఫోన్ చెరువులో.. దుస్తులు దహనం.. పోలీసుల విచారణలో నేరం అంగీకారం



ప్రజా వాయిస్,హన్మకొండ: భర్తను కోల్పోయి తల్లిదండ్రుల వద్ద ఉంటున్న మహిళను ప్రేమ పేరుతో నమ్మించి, చివరకు దారుణంగా హత్య చేసిన ఘటన హనుమకొండ జిల్లాలో సంచలనం రేపింది. హసన్‌పర్తికి చెందిన స్వప్న (40) కు గతంలో బళ్లారికి వెళ్లిన సమయంలో డ్రైవర్ బసవరాజ్‌తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది.కొంతకాలం తర్వాత తనను పెళ్లి చేసుకోవాలని స్వప్న కోరింది. అందుకు బసవరాజ్ నిరాకరించాడు. అయితే తమ మధ్య ఉన్న సీక్రెట్ ఫొటోలు, వీడియోలను బయటపెడతానని ఆమె బెదిరించడంతో.. పరువు పోతుందనే భయంతో స్వప్నను హత్య చేయాలని బసవరాజ్ నిర్ణయించుకున్నట్లు పోలీసులు తెలిపారు.

పెళ్లి పేరుతో పిలిచి..

మే 15న పెళ్లి చేసుకుంటానని నమ్మించి స్వప్నను బళ్లారికి రప్పించాడు. అక్కడ సిద్దేశ్వర ఆలయం వద్ద ఆమెను హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా నరికినట్లు పోలీసులు తెలిపారు. ఆధారాలు దొరకకుండా ఆమె ఫోన్‌ను చెరువులో పడేసి, దుస్తులను తగలబెట్టినట్లు పేర్కొన్నారు.

కాల్ డేటాతో చిక్కిన నిందితుడు

స్వప్న కనిపించకపోవడంతో ఆమె తల్లిదండ్రులు మే 31న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా కాల్‌డేటా, ఫోన్ లొకేషన్‌ను పరిశీలించిన పోలీసులు బసవరాజ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో తానే హత్య చేసినట్లు అతడు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



జిల్లా ఖజానా కార్యాలయంలో వార్షిక తనిఖీ

- ఖజానా నిర్వహణలో నిబంధనలు, పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలి
- సీనియర్ డీఏజీ ఎం. నరేష్ కుమార్

జా వాయిస్ సంగారెడ్డి: తెలంగాణ రాష్ట్ర సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ ఎం. నరేష్ కుమార్ (ఇండియన్ ఆడిట్ అండ్ అకౌంట్స్ సర్వీసెస్ అధికారి) శుక్రవారం సంగారెడ్డి జిల్లా ఖజానా కార్యాలయంలో వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈనెల 7 నుండి కొనసాగుతున్న వార్షిక ఆడిట్‌లో భాగంగా చివరి రోజున ఆయన కార్యాలయాన్ని సందర్శించి, వివిధ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌తో పాటు జిల్లాలో పనిచేస్తున్న ఏటీఓలు, ఎస్‌టీఓలతో ఆయన సమావేశమై ఖజానా నిర్వహణ, ఆడిట్ అంశాలు, కార్యాలయ విధులపై సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న ఆడిట్ అభ్యంతరాలు (Outstanding Audit Paras), ప్రస్తుత ఆడిట్ అభ్యంతరాలు తదితర అంశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా నరేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆర్థిక లావాదేవీల నిర్వహణలో నిబంధనలు, విధివిధానాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. IFMIS పోర్టల్ ద్వారా పేపర్‌లెస్ ఆన్‌లైన్ బిల్లుల సమర్పణ జరుగుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు, సిబ్బంది విధి విధానాలను పూర్తిగా అవగాహన చేసుకొని, ఎలాంటి లోపాలకు తావులేకుండా బిల్లుల ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. పెన్షనర్లకు సంబంధించిన పెన్షన్ల చెల్లింపుల ప్రక్రియను సక్రమంగా, సకాలంలో నిర్వహించాలని, అదేవిధంగా నెలవారీ అకౌంట్స్ నిర్దిష్ట గడువులోగా అకౌంటెంట్ జనరల్ కార్యాలయానికి సమర్పించాలని సూచించారు.ఖజానా కార్యాలయాల్లో రికార్డులు, రిజిస్టర్లు, ఆర్థిక లావాదేవీల వివరాలను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేసి భద్రపరచాలని, ప్రభుత్వ నిధుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం, ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని సూచించారు. జిల్లా ఖజానా కార్యాలయంలో రికార్డుల నిర్వహణ, విధుల అమలు, ఆడిట్ ప్రక్రియకు సంబంధించి చేపడుతున్న చర్యలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, ఏ టి ఓ లు, ఎస్‌టీఓలు సంపత్ స్వరూప్, రాజారెడ్డి, శారద, ఏటీఓలు, జిల్లా ఖజానా కార్యాలయంలోని వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

కరెంటు కోతలు ఆందోళనలో అన్నదాతలు

- ధర్నాలు రాస్తారోకోలు
- వ్యవసాయం కు 6 గంటలే ఇస్తున్నారని అన్నదాత ఆవేదన
- ట్రాన్స్కో అధికారులు అలసత్వం కరువైన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- ఎండుతున్న పంటలు గోన పడుతున్న అన్నదాత



ప్రజావాయిస్ కామారెడ్డి జిల్లా ప్రతినిధి/కామారెడ్డి జిల్లాలో అప్రకటిత కరెంటు కోతలు రైతులను నిద్ర లేకుండా చేస్తున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు కేవలం 6 గంటలు మాత్రమే వ్యవసాయ రంగానికి కరెంటు సరఫరా చేస్తున్నారని, అప్రకటిత విద్యుత్ కోతలతో వరి ఇతర పంటలు ఎండిపోతున్నాయని అన్నదాత ఆవేదన చెందుతున్నారు. గత వారం రోజులుగా కరెంటు కోతలు రైతన్న కలవర పెడుతున్నాయి. రైతులు ఇతరులు సబ్ స్టేషన్ల ముందు ధర్నాలు రోడ్లపై రాస్తారోకోలు చేస్తున్నారు. రైతులకు అండగా టిఆర్ఎస్ నాయకులు మద్దతునిస్తున్నారు. మాచారెడ్డి రాజంపేట బిబిపేట మండలాలలో విద్యుత్ సబ్స్టేషన్లో ముందు రైతులు కరెంటు పోతలకు నిరసనగా ధర్నాలు చేపడుతున్నారు. మాచ రెడ్డి బిబిపేట రైతులు రోడ్లపై రాస్తారోకోలు చేసి కరెంటు కోతలకు నిరసనగా నిరసనలు ధర్నాలు చేపడుతున్నారు. గత వారం రోజులుగా కామారెడ్డి జిల్లాలో విద్యుత్ సరఫరా దారుణంగా క్షీణించింది. జూలైలో వేసిన పంటలకు నీరం దకపోవడంతో వరి పంట ఇతర పంటను దశలో ఎండిపోతున్నాయని నేరలు మారుతున్నాయని రైతన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వరి పంట ఏని ఈనె దశలో, పొట్ట వచ్చిన దశలో కరెంటు అప్రకటిక కోతలు అన్నదాత ఆందోళనకు కారణం అవుతున్నాయి. ఆది సోమవారాలు కురిసిన కొద్దిపాటి వర్షాలతో రైతన్న ఊరట పొందారు. గత వారం పది రోజులుగా వ్యవసాయ రంగానికి కేవలం 6 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తున్నారని రైతులు కన్నెర్ర చేస్తున్నారు. మండల కేంద్రాలలో సబ్స్టేషన్ల ముందు రైతులు ధర్నాలు రాస్తారోకోలు చేపడుతున్నారు. ఇటీవల జరిగిన దోమకొండ మండల సమావేశంలో వరి పంట ఎండిపోవడం, కరెంటు కోతలు విధించడం పై విద్యుత్ అధికారులను సర్పంచులు నిలదీశారు ప్రశ్నించారు. విద్యుత్ శాఖ పై ఆజమాయిషి లోపించిందని సర్పంచులు ఆరోపించారు. విద్యుత్ కోతలతో విద్యుత్ సిబ్బంది పని చేసే కేంద్రాలలో అందుబాటులో ఉండకపోవడంతో విద్యుత్ సరఫరా అంతరాయాలు కోతులు పంటలను పొట్టకు వచ్చే దశలో నష్టపోతున్నామని సర్పంచులు దోమకొండ మండల సభలో విద్యుత్ శాఖ అధికారులను నిలదీశారు ప్రశ్నించారు. గత ఎనిమిది నెలలుగా దోమకొండకు విద్యుత్ శాఖ ఏఈ లేదని బిబిపేట అధికారితో ఇన్చార్జిగా వ్యవహరిస్తున్నారని ప్రభుత్వ అడ్వైజర్ షబ్బీర్ స్వయంగా వరంగల్ ఎంపీడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డికి సిఫారసు చేసిన ఇంతవరకు నియమించలేదని ప్రజాప్రతినిధులు సర్పంచులు విమర్శిస్తున్నారు. ఏ ఈ, ఎ డి ఈ, డి ఈ, ఎస్ ఈ స్థాయిల ట్రాన్స్కో అధికారుల పర్యవేక్షణ లోపించడంతో కిందిస్థాయి సిబ్బంది సేవలు అందించడంలో విఫలం చెందుతున్నారని, కరెంటు కోతలతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు సర్పంచులు ప్రతిపక్ష పార్టీల నేతలు విమర్శిస్తున్నారు. ఇటీవల కామారెడ్డిలో వరంగల్ ట్రాన్స్కో సీ ఎం డి వరుణ్ రెడ్డి వచ్చినప్పుడు కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఆప్రకటిత విద్యుత్ కోతలను పలువురు సీఎంని దృష్టికి తీసుకువచ్చారు. భారతీయ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కరెంటు కోతలకు నిరసనగా కామారెడ్డి జిల్లా స్థాయి విద్యుత్ అధికారి ఎస్పీ ఆఫీసు ముందు ధర్నా ఆందోళన రాస్తారోకో చేపట్టారు. వరి పంట పోట్టకు వచ్చే దశలో, ఈనె దశలో కరెంటు కోతలు, సరఫరాలో రోజుకు పది 12 సార్లు అంతరాయాలు, పంటలు పంటలు ఎండిపోతున్నాయని, పంట పొలాలు నేరెలు వారుతున్నాయని బారుతున్నాయని రైతన్న ఆవేదన చెందుతున్నారు. ఎమ్మెల్యేలు అధికార పార్టీ నేతలు ప్రభుత్వ సలహాదారులు కరెంటు కోతలపై స్పందించడం లేదని పంటలు ఎండిపోతున్నాయని వేలాది మంది రైతులు కామారెడ్డి విద్యుత్ శాఖ ఎస్ ఈ ఆఫీసు ముందు నినాదాలు చేశారు. కరెంటు కోతలపై ఎమ్మెల్యేలు అడ్వైజర్లు స్పందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయ రంగానికి కాంగ్రెస్ సర్కారు చెప్పిన ప్రకారం 12 గంటల సరఫరా ఇవ్వాలని కేవలం 6 గంటలు మాత్రమే వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేస్తున్నారని రైతులు విమర్శిస్తున్నారు. ఆది సోమవారాలు కొద్దిపాటి వర్షాలతో రైతులకు కొంత మేర ఊరట జరిగింది. వర్షాకాలంలో అప్రక్కుటిత విద్యుత్ కోతలు, సరఫరాలో కోత విధిస్తే మళ్లీ అంతరాయాలు, విద్యుత్తు లైన్ల సరైన నిర్వహణ లేకపోవడం, కిందిస్థాయి సిబ్బంది సక్రమ విధులు నిర్వహించకపోవడం పలు కారణాలతో రైతుల పంట పొలాలు దెబ్బతింటున్నాయి

ప్రజాధనం మన్ను పాల్.. ప్రభుత్వ నిర్లక్ష్యానికి వైకుంఠ ధామాలే నిదర్శనం!

- మంథని మండలం మైదిపల్లి శివారులో నిరుపయోగంగా పడి ఉన్న స్మశాన వాటిక
- అనాలోచిత నిర్ణయాలు అనుకూలం కాని స్థలాల్లో నిర్మాణాలతో నిధులు దుర్వినియోగం
-ఊరికి దూరంగా, అసౌకర్యాల నడుమ వెక్కిరిస్తున్న నిర్మాణం

ప్రజా వాయిస్ మంథని

గత ప్రభుత్వ హయాంలో ఆర్భాటంగా ప్రారంభించిన ప్రణాళికలు, క్షేత్రస్థాయి పరిశీలన లేని నిర్ణయాలు నేడు ప్రజాధనాన్ని బూడిదలో పోసిన పన్నీరులా మార్చేశాయి. పాలకులు ప్రకటనలకే ప్రాధాన్యమిచ్చి, అధికారులు కాగితాల్లో లెక్కలు పూర్తి చేయడంతో రూ. లక్షల ప్రజాధనం నీటిపాలైంది. పెద్దపల్లి జిల్లా మంథని మండలం మైదిపల్లి గ్రామ శివారులో గత ప్రభుత్వంలో నిర్మించిన వైకుంఠ ధామం (స్మశాన వాటిక) పాలకుల అనాలోచిత నిర్ణయాలకు, నిధుల దుర్వినియోగానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో అంతిమ సంస్కారాలకు ఇబ్బందులు కలగకూడదనే నెపంతో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఈ వైకుంఠ ధామం, నేడు దేనికీ కొరగాకుండా పోయింది. గ్రామస్తుల అవసరాలు, స్థానిక పరిస్థితులను పట్టించుకోకుండా ఊరికి దూరంగా, అనుకూలం కాని ప్రదేశంలో దీనిని నిర్మించారు. అంతిమ సంస్కారాలు నిర్వహించడానికి కావలసిన ప్రాథమిక సౌకర్యాలు, నీటి వసతి, విద్యుత్, సరైన దారి లేకపోవడంతో గ్రామస్తులు ఎవరూ ఇటువైపు రావడం లేదు. ప్రజల రెక్కల కష్టం నుంచి వసూలు చేసిన పన్నుల డబ్బుతో నిర్మించిన ఈ వైకుంఠ ధామం, కేవలం గత ప్రభుత్వంలో లక్ష్యాలు (టార్గెట్స్) పూర్తి చేయడం కోసమే కట్టారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాధనాన్ని పక్కదారి పట్టించి, సరైన వినియోగం లేకుండా వదిలేయడంతో ఈ నిర్మాణం ప్రస్తుతం పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలతో నిండిపోయి భూతబంగ్లాను తలపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ పొరపాట్లను సరిదిద్ది,



ప్రజాధనం వృథా కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ఆ ప్రాంగణానికి రహదారి వసతి, నీటి సౌకర్యం కల్పించి వినియోగంలోకి తీసుకురావాలని లేదా ప్రత్యామ్నాయంగా ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని మైదిపల్లి ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు



పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

- మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేసిన మొలుగూరి మహేష్

ప్రజా వాయిస్ గోదావరిఖని

పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, వినాయక చవితికి మట్టి విగ్రహాలనే పూజించాలని నాయకులు మొలుగూరి మహేష్ పిలుపునిచ్చారు. రామగుండం నగరంలోని 52, 57వ డివిజన్ల పరిధిలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయన రంగుల విగ్రహాల వల్ల జల వనరులు కలుషితమవుతున్నాయని, ప్రకృతి సిద్ధమైన మట్టి విగ్రహాలను పూజించడమే శ్రేయస్కరమని పేర్కొన్నారు. ప్రజలందరూ పర్యావరణ హితంగా పండుగ జరుపుకోవాలని కోరారు. ?ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్, 58వ డివిజన్ కార్పొరేటర్ మేకల సమ్మయ్య, మాజీ కార్పొరేటర్లు నారదాసు మారుతి, నేరటి శ్రీనివాస్, నాయకులు కనుకుల రవిచంద్ర, మొలుగూరి చందు, గుంటి అశోక్, డోనికెన సదానందం, అంకల రాజమౌళి, చిదురాల సదానందం, గుంపుల సాయికుమార్, మాస్కు మహేష్, చిదురాల కొమ్మురయ్య తదితరులు పాల్గొన్నారు.

దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఓట్ల కోసమే రాజకీయం

మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

- కాటారం మండల ప్రజలకు చేసిందేమీ లేదు
- చెరువుల్లో నీళ్లు నింపకుండా భూములను ఎండబెడుతున్నారు
- అన్నం పెట్టిన ప్రజలకే సున్నం పెడుతున్న మంత్రి
- సాగునీరు అందించే వరకు పోరాటం ఆపేది లేదు

ప్రజా వాయిస్ కాటారం

ఓట్ల కోసం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఎంతటికైనా దిగజారుతారని, ఎన్నికల్లో వరుసగా మెజార్టీ ఇచ్చే కాటారం మండల ప్రజలకు ఆయన చేసింది శూన్యమని మంథని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పుట్ట మధూకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. సోమవారం ఆయన కాటారం మండలంలోని ఒడిపిలవంచ ఊర చెరువు, జాదరావుపేట పెద్ద చెరువు, వీరాపూర్ శివశంకర్ ప్రాజెక్ట్‌లను బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికలు రాగానే చిన్న కాళేశ్వరం ప్రాజెక్టును వాడుకోవడం, హామీలతో మోసం చేయడం శ్రీధర్‌బాబుకు అలవాటుగా మారిందన్నారు. కాళేశ్వరం నిర్వాసితులకు మూడేళ్లయినా పరిహారం అందించలేదని ఆరోపించారు. కాటారం పరిధిలోని చెరువుల్లో రింగ్ బండ్‌లు వేసి నీటిని నిలిపే మార్గం ఉన్నా, నిధులు కేటాయించకుండా రైతుల భూములను ఎండబెడుతున్నారన్నారు. ప్రతి ఎన్నికల్లో కాటారం ప్రజలు వేలాది ఓట్ల మెజార్టీ ఇస్తున్నప్పటికీ ప్రాంత అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని, అన్నం పెట్టిన ప్రజలకే సున్నం పెడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల వేళ ఓటుకు రూ. 5 వేలు ఇచ్చి గెలవవచ్చనే అహంకారంతో మంత్రి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వర్షపు నీరు వృథాగా సముద్రం పాలవుతున్నా పట్టించుకోవట్లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మెడలు వంచైనా



రైతులకు సాగునీరు అందించే వరకు పోరాడతామని ఆయన హెచ్చరించారు. వచ్చే వానాకాలం నాటికైనా ఈ చెరువులను పునరుద్ధరించి సాగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.



ఉద్దెమర్రి శివాలయంలో ఘనంగా విఘ్నేశ్వరుడి పూజ

భక్తిశ్రద్ధలతో పూజలు.. పాల్గొన్న భజన బృందం, గ్రామ పెద్దలు, భక్తులు

శామీర్ పేట్ / ప్రజా వాయిస్ :

మూడు చింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఉద్దెమర్రి గ్రామంలోని శివాలయం వద్ద సోమవారం విఘ్నేశ్వరుడి పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శివాలయంలో ప్రతిష్ఠించిన గణేష్ విగ్రహాన్ని దాతలు నిమ్మ సూచిత్ర–వాసుదేవ రెడ్డి దంపతులు అందించారు.ఈ సందర్భంగా దాత దంపతులు తమ తల్లిదండ్రులతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం శివాలయం భజన బృందం సభ్యులు, భక్తులు భజనలు నిర్వహిస్తూ స్వామివారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. ఈ పూజా కార్యక్రమానికి గ్రామ పెద్దలు, శివాలయం భజన బృందం సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు. పూజ అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేయగా, భక్తులు స్వీకరించారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

బి.టెక్ విద్యార్థిని అక్షితరాణి అనుమానాస్పద మృతి

- గోదావరిఖనిలో ఉద్రిక్తత, జాతీయ రహదారి దిగ్బంధం
- అత్యాచారం చేసి విషం తాపించి చంపారని దళిత సంఘాల ఆవేదన
- నిందితులు రవికుమార్, నవీన్‌లను వెంటనే అరెస్ట్ చేయాలి
- బాధితురాలి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం ఇవ్వాలి
- ఫోన్‌లో మాట్లాడి పూర్తి న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- నిందితులను కఠినంగా శిక్షిస్తామన్న పోలీసు ఉన్నతాధికారుల హామీతో విరమించిన రాస్తారోకో

ప్రజా వాయిస్ గోదావరిఖని

రామగుండం సింగరేణిలో ట్రైనింగ్ పొందుతున్న దళిత (మాదిగ) వర్గానికి చెందిన బి.టెక్ విద్యార్థిని అక్షితరాణి అనుమానాస్పద మృతికి నిందితులే కారణమని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దళిత సంఘాలు, ఎంఆర్‌పీఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతురాలి శవంతో గోదావరిఖని బస్టాండ్ సమీపంలోని జాతీయ రహదారిపై దళిత సంఘాల నాయకులు భారీ రాస్తారోకో, నిరసన ప్రదర్శన చేపట్టారు. శిక్షణ సమయంలో రవికుమార్, నవీన్ అనే ఇద్దరు వ్యక్తులు అక్షితరాణిని తీవ్రంగా వేధింపులకు గురిచేశారని, ఈ విషయంపై బాధితురాలు ముందే సింగరేణి జీఎంకి ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లే నిందితులు రెచ్చిపోయి ఈ ఘాతుకానికి ఒడిగట్టారని నాయకులు ఆరోపించారు. నిందితులు ఆమెపై అత్యాచారం చేసి, బలవంతంగా విషం తాపించి హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ?ఈ సందర్భంగా నిందితులైన నవీన్, రవికుమార్‌లతో పాటు బాధితురాలి ఫిర్యాదును నిర్లక్ష్యం చేసిన సింగరేణి జీఎంపై కూడా ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ, హత్య, అత్యాచారం కేసులు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. అలాగే సింగరేణి యాజమాన్యం మృతురాలి కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఒకరికి ఉద్యోగ భద్రత, మరియు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కేటాయించాలని కోరారు. విషయం తెలుసుకున్న సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నాయకులతో ఫోన్‌లో మాట్లాడి బాధితురాలి కుటుంబానికి సంపూర్ణ న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. స్థానిక పోలీస్ ఉన్నతాధికారులు కూడా నిందితులను కఠినంగా శిక్షిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో నాయకులు తాత్కాలికంగా నిరసన విరమించారు. అయితే ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని దళిత సంఘాల నాయకులు స్పష్టం చేశారు.





ఇంకుడు గుంత వినాయకుడు.. పర్యావరణ పరిరక్షణే ధ్యేయం!

కోరుట్ల మున్సిపాలిటీలో వినూత్న కాన్సెప్ట్ మండపం
ప్రత్యేక పూజలు చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్

ప్రజా వాయిస్, కోరుట్ల:

ప్రజల్లో పర్యావరణ పరిరక్షణతో పాటు భూగర్భ జలాల పెంపుపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా కోరుట్ల పురపాలక సంఘంలో వినూత్నంగా ఏర్పాటు చేసిన “ఇంకుడు గుంత వినాయకుడు” అందరినీ ఆకట్టుకుంటుంది. “ఇంటికో ఇంకుడు గుంత నిర్మించుకుందాం – ప్రతి ఒక్కరూ మొక్కలు నాటుదాం” అనే సామాజిక నినాదంతో ఈ కాన్సెప్ట్ మండపాన్ని మున్సిపల్ సిబ్బంది ఏర్పాటు చేశారు. ఈ వినాయకుడికి మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి వసంత తిరుమల, ఇన్‌చార్జ్ కమిషనర్ అరుణ్ కుమార్, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, ఇన్‌చార్జ్ ఆర్.ఐ. అక్షయ్, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, పర్యావరణ ఇంజనీర్ మహేష్ మున్సిపల్ సిబ్బందితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్, ఇన్‌చార్జ్ కమిషనర్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో రాబోయే తీవ్ర నీటి కొరతను అధిగమించడానికి పట్టణ ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, వర్షపు నీటిని భూగర్భంలోకి మళ్లించాలని కోరారు. అదేవిధంగా పట్టణంలో పచ్చదనం పరిరక్షణ కోసం ప్రతి ఇంటా మొక్కలు నాటి వాటిని బాధ్యతాయుతంగా పెంచాలని విజ్ఞప్తి చేశారు.

నూతన కోర్టు భవన నిర్మాణానికి ఆరు ఎకరాల స్థలం కేటాయించాలి

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి మిర్యాలగూడ బార్ అసోసియేషన్ వినతి
సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే బత్తుల

ప్రజా వాయిస్,మిర్యాలగూడ.

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మిర్యాలగూడ పట్టణంలో జనాభా రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో, ప్రస్తుతం ఉన్న కోర్టు భవనం న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయ సిబ్బంది అవసరాలకు సరిపోవడం లేదని మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. నూతన కోర్టు భవన సముదాయం నిర్మాణం కోసం ఆరు (6) ఎకరాల స్థలాన్ని కేటాయించాలని కోరుతూ మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గౌరు వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు, పలువురు న్యాయవాదులు కలిసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు.అనంతరం నూతన కోర్టు భవన సముదాయం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. మిర్యాలగూడలో జనాభా పెరుగుతున్న కొద్దీ న్యాయపరమైన వివాదాలు, కేసుల సంఖ్య కూడా పెరుగుతున్నాయని వారు వివరించారు. ప్రస్తుతం ఉన్న కోర్టు భవనం భవిష్యత్ అవసరాలకు సరిపోని పరిస్థితి నెలకొన్నందున, అన్ని రకాల కోర్టులను ఒకే భవన సముదాయంలో ఏర్పాటు చేసేలా నూతన కోర్టు భవనాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని తెలిపారు.అదేవిధంగా నూతన భవన సముదాయంలో న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయ సిబ్బంది తదితరుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని తగిన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, పార్కింగ్ సౌకర్యం, కక్షిదారుల అవసరాలు, న్యాయవాదుల సౌకర్యాలు, భవిష్యత్ అవసరాలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ప్రజలకు న్యాయం వేగంగా, సౌకర్యవంతంగా అందాలంటే తగిన మౌలిక వసతుల కల్పన ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఈ వినతిపై ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సానుకూలంగా స్పందించారు. సంబంధిత స్థానిక అధికారులతో మాట్లాడి, నూతన కోర్టు భవన నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించే విషయంపై త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జంగిల్ ఎల్లయ్య, జాయింట్ సెక్రటరీ రాయారపు భాస్కర్, కోశాధికారి రెడ్డిపల్లి సైదులు, లైబ్రరీ సెక్రటరీ కందిమళ్ల వెంకట్ రెడ్డి, భూక్య రమేష్, పెండ్యాల నరసింహారావు, కేంద్ర ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సిల్ మట్టయ్యదూపాటి, జిల్లా కోర్టు పి.పి. రఘురామారావు, ఏ.జె.పి. గోదాల వెంకట్ రెడ్డి, శ్రీధర్, రమేష్ నాయక్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

వినాయక మండపానికి శాశ్వత రేకుల షెడ్

మైలారం గ్రామంలో ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు

స్థానిక యువత విజ్ఞప్తికి స్పందించిన.. పరుపాటి శ్రీనివాస్ రెడ్డి.గతేడాది ఇచ్చిన హామీ అమలు

రాయపర్తి మండలం మైలారం గ్రామంలో సేవా కార్యక్రమం



ప్రజా వాయిస్ /రాయపర్తి, సెప్టెంబర్ 14: వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామంలో వినాయక మండపానికి శాశ్వత రేకుల షెడ్ ఏర్పాటు చేశారు. స్థానిక యువత విజ్ఞప్తి మేరకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నిర్మాణాన్ని చేపట్టారు. గతేడాది ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ శాశ్వత రేకుల షెడ్ నిర్మాణం పూర్తి చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.గ్రామంలోని జెడ్పీఎస్ఎస్ హైస్కూల్ వద్ద వినాయక మండపం కోసం గతంలో స్థానిక యువత ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్‌ను ఆశ్రయించారు. వారి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ఫౌండేషన్ నిర్వాహకులు శాశ్వత రేకుల షెడ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు నిర్మాణం పూర్తి చేసి వారి యొక్క తల్లిదండ్రులైన పరుపాటి సరోజన యాదవ రెడ్డి దంపతులు ప్రారంభించారు. వినాయక చవితి రోజున అందుబాటులోకి తీసుకొచ్చారు.ఈ సందర్భంగా ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తమ ఫౌండేషన్ కృషి చేస్తోందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి సేవా కార్యక్రమాలు చేపట్టడమే లక్ష్యమని తెలిపారు. వినాయక మండపానికి శాశ్వత రేకుల షెడ్ ఏర్పాటు చేయడం ద్వారా గ్రామ యువతకు, ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో గ్రామస్తులు, స్థానిక యువత, మహిళలు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. సేవా కార్యక్రమానికి సహకరించిన ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుండి హనుమకొండ బస్టాండ్ మీదుగా లోకల్ బస్సులు

టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజనల్ మేనేజర్ భవానీ ప్రసాద్

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని వరంగల్ కాజీపేట మధ్య మంగళవారం నుండి అదనంగా లోకల్ బస్సులు హనుమకొండ బస్టాండ్ మీదుగా నడపనున్నట్లు వరంగల్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ భవాని ప్రసాద్ తెలిపారు. 1డీ పేరుతో ప్రతిరోజు 46 ట్రిప్పులను తిప్పడం జరుగుతుందని ఆయన వివరించారు. వరంగల్ నుండి హనుమకొండ చౌరస్తా, హనుమకొండ బస్టాండ్, కాళోజీ కళాక్షేత్రం, బాలసముద్రం, అదాలత్ మీదుగా కాజీపేటకు పోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా కాజీపేట నుండి అదాలత్, బాలసముద్రం, కాళోజీ కళాక్షేత్రం, అశోక జంక్షన్ ,హనుమకొండ చౌరస్తా మీదుగా వరంగల్ కు ఈ బస్సులు నడపడం జరుగుతుందని తెలిపారు. నగర ప్రజలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న ప్రయాణికులను దృష్టిలో పెట్టుకొని హనుమకొండ సెంట్రల్ బస్టాండ్ నుంచి దూర ప్రాంతాలకు బస్సులు ఉండడం వలన వాటిని అనుసంధాన పరిచే క్రమంలో 1డీ బస్సులను నడపడం జరుగుతుందని వివరించారు. వరంగల్-కాజీపేట రైల్వే ప్రయాణికులు కూడా హనుమకొండ బస్టాండ్ కు రావడానికి కాస్త ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తాము గ్రహించామని దీనికి అనుగుణంగా 1డీబస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని మరిన్ని ట్రిప్పులు పెంచడానికి కూడా ప్రయత్నిస్తామన్నారు. గతంలో తిరుగుతున్నట్లుగానే మరికొన్ని లోకల్ బస్సులు పెట్రోల్ పంపు, పబ్లిక్ గార్డెన్ ద్వారా కూడా నడుస్తాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు ఉపయోగించుకొని ఆర్టీసీని మరింతగా ఆదరించాలని ఆర్ఎం కోరారు.



గంజాయి సాగు చేస్తున్న ఇద్దరు నిందితుల అరెస్టు, 1,245 మొక్కలు స్వాధీనం

కోటి 25 లక్షల విలువైన గంజాయి పట్టివేత, కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరిక

ప్రజా వాయిస్ ఆసిఫాబాద్

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేసి, 1,245 గంజాయి మొక్కలు, 11 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తేదీ 13న జైనూర్ ఎస్ఐ జి. రవికుమార్‌కు అందిన సమాచారం మేరకు పట్నాపూర్ మెయిన్ రోడ్ వద్ద తనిఖీలు చేపట్టగా, అనుమానాస్పదంగా కనిపించిన అంబురే పుండలిక్ వద్ద టవల్‌లో దాచిన 11 గ్రాముల ఎండు గంజాయి లభించింది. దర్యాప్తులో ఇతను తన కుమారుడితో కలిసి సొంత వ్యవసాయ భూమిలో గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తించారు. వ్యవసాయ విస్తరణ అధికారి, ప్రభుత్వ పంచుల సమక్షంలో తనిఖీ చేయగా 1,245 గంజాయి మొక్కలను వేర్లతో సహా స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 1.25 కోట్లుగా అంచనా.కేసు నమోదు చేసి అంబురే పుండలిక్, అంబురే రమేష్‌లను సెప్టెంబర్ 14న అరెస్టు చేశారు. గంజాయి, మాదకద్రవ్యాల సాగు, రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ నితికా పంత్ హెచ్చరించింది. అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలని ప్రజలకు కోరింది. నిందితులను పట్టుకున్న జైనూర్ పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించింది.ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డిఎస్పీ అశోక్, జైనూర్ సిఐ రమేష్, ఎస్ఐ రవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీసాంస్కృతి-సంప్రదాయలనుకాపాడుకోవాలి

ఆదివాసీ దొర పటేళ్ల సంఘం

16 న కొత్తల పండుగ/పెద్దల పండుగ

ఉమ్మడి కొత్తగూడ మండలం లో ఆదివాసీ లు

ఘనంగా నిర్వహించుకోవాలి-తుడుందెబ్బ,

ఆదివాసీ ఉద్యోగ సంఘాలు

ప్రజా వాయిస్ ,కొత్త గూడ

కొత్తగూడఆదివాసీ తెగ లలో కోయ తెగ వారు ఉత్తేర కార్తీ మొదటి పాదం లో జరిగే కొత్తల పండుగ/పెద్దల పండుగను ఉమ్మడి కొత్తగూడ మండలంలో ఉన్న అన్ని ఆదివాసీ గూడెం లలో ఘనంగా నిర్వహించుకోవాలని ఉమ్మడి కొత్తగూడ మండల ఆదివాసీ దొర పటేళ్ల సంఘ నాయకులు అలెం గణేష్,మల్లెల బాబు పిలుపునిచ్చారు.పూర్వం నుండి ఆదివాసిల సాంస్కృతి-సాంప్రదాయాల కు ఒక ప్రత్యేకత ఉంది.వారి జీవన విధానం కట్టు బొట్టు బాషా కు కూడ ఎంతో ప్రాముఖ్యత ఉంది.వారి సంప్రదాయ పండుగలలో పెద్దల పండుగ ఒకటి.ఆదివాసీలు సాగు చేసి పండించే పంటలలలో కొత్తగా వచ్చే వెన్ను నీ వేల్పుల దగ్గర కట్టుకోవడం, స్వర్గిస్తులు అయిన వారి పూర్వికులను స్మరించుకుకోవడం,నూతనంగా గ పెళ్లి అయిన వధువు ఇంటి గొట్టు గోత్రాలు వరుడు ఇంటి గొట్టు గోత్రలలో చేర్చడం జరుగుతుంది.కావున ఉమ్మడి కొత్తగూడెం మండలం లో ఉన్న ఆదివాసి ప్రజలు ఉత్తరకార్తి మొదటి పాదంలో వచ్చే బుధ,గురువారాలలో భక్తి శ్రద్ధలతో కొత్తల పండుగ/పెద్దల పండుగ ను అన్ని ఆదివాసీ గూడాలలో నిర్వహించుకోవాలనీ పిలుపునిచ్చారు.ఆదివాసీ సాంస్కృతి-సాంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్క ఆదివాసీ బాధ్యత అని భవిష్యత్తు తరాలకు మన సాంస్కృతి-సంప్రదాయాలను అందివ్వడం మన బాధ్యత అని అన్నారు.ఆదివాసీలు జరుపుకునే ఈ కొత్తల పండుగ / పెద్దల పండుగ కు ఎంతో ప్రాముఖ్యత ఉంది కాబట్టి ప్రభుత్వం సెప్టెంబర్ 16 న సెలవు మంజూరు చేయాలనీ ఆదివాసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్యక్రమం లో మల్లెల నర్సయ్య దొర బూరుగుంపు,తుడుందెబ్బ నాయకులు మల్లెల రాము తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కుంజ నర్సింగ రావు జిల్లా అధ్యక్షులు తుడుందెబ్బ, పూనేం సందీప్ కుమార్



తుడుందెబ్బ మండల అధ్యక్షులు కొత్తగూడ, మల్లెల సారయ్య తుడుందెబ్బ మండల ప్రధాన కార్యదర్శి, మల్లెల రణదీర్ మాజీ సర్పంచ్ కొత్తగూడ, ఆదివాసీ నాయకులు గుమ్మడి సమ్మయ్య, వజ్జ బాలరాజు,సిద్దబోయిన భద్రయ్య,కంగాల నారాయణ,తాటి అనిల్, కంగాల రవి ఆదివాసీ ఉద్యోగ సంఘ నాయకులు చుంచ సారయ్య దొర, వాసం కిషేశీదర్, అలెం సాంబయ్య, సిద్దబోయిన లక్ష్మీ నారాయణ-డీలర్, తాటి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో అతలాకుతలమైన హుస్నాబాద్ ప్రాంతం

మునిగిన బస్టాండ్, తెగిపోయిన రహదారులు

ప్రజా వాయిస్ హుస్నాబాద్

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలు తీవ్ర అలజడి సృష్టించాయి. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా పడిన వానకు హుస్నాబాద్ పట్టణంలోని బస్టాండ్‌లోకి వర్షపు నీటితో పాటు డ్రైనేజీ నీరు చేరడంతో పరిసరాలన్నీ జలమయమయ్యాయి. బస్టాండ్ ఆవరణలో పెద్ద ఎత్తున నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ యంత్రాంగం వెంటనే రంగంలోకి దిగింది. మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు స్వయంగా నీటి నిల్వ ప్రాంతాలను పరిశీలించి పరిస్థితిని పర్యవేక్షించారు. మున్సిపల్ కార్మికులు వెంటనే డ్రైనేజీ నీటిని బయటకు పంపేందుకు చర్యలు చేపట్టడంతో పాటు బస్టాండ్ పరిసరాల్లో పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేసి ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూశారు.మరోవైపు మండల పరిధిలోని తోటపల్లి నుంచి జనగాం వెళ్లే లింకు రోడ్డు వరద ఉధృతికి పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో ఇరు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయి, అటువైపు వెళ్లే రైతులకు, ప్రజలకు తీవ్ర అవస్థలు ఎదురవుతున్నాయి.







అపోహలు నమ్మొద్దు.!

హైస్కూల్ ముందు దుకాణాల ఏర్పాటుపై పాలకవర్గం స్పష్టత

నిబంధనల ప్రకారమే నిర్ణయాలు.. తప్పుడు ప్రచారంపై ఆగ్రహం

వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయొద్దని హితవు

అభివృద్ధికి అడ్డుగా మారే ప్రచారాన్ని సహించబోమని హెచ్చరిక

ప్రజా వాయిస్,చిలుకూరు:

సూర్యాపేట జిల్లా చిలుకూరు గ్రామపంచాయతీ పాలకవర్గంపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని చిలుకూరు పాలకవర్గ సభ్యులు తీవ్రంగా ఖండించారు. ముఖ్యంగా జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ ముందు దుకాణ సముదాయాల ఏర్పాటుపై ప్రజల్లో అపోహలు కలిగించేలా ప్రచారం జరుగుతోందని, ఇందులో వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం సరికాదని స్పష్టం చేశారు.గ్రామ అభివృద్ధి, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునే పంచాయతీ నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు. దుకాణ సముదాయాల ఏర్పాటుకు సంబంధించిన అంశంలో నిబంధనలకు అనుగుణంగానే వ్యవహరిస్తున్నామని పేర్కొన్నారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా పాలకవర్గంపై ఆరోపణలు చేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించొద్దని సూచించారు.అభివృద్ధి పనులను అడ్డుకునేలా తప్పుడు ప్రచారం చేయడం సరికాదని సభ్యులు పేర్కొన్నారు. పంచాయతీ నిర్ణయాలపై ఎవరికైనా సందేహాలుంటే అధికారిక వివరాలు తెలుసుకోవాలని సూచించారు. హైస్కూల్ ముందు దుకాణ సముదాయాల అంశంపై అనవసర రాద్ధాంతం చేయకుండా వాస్తవాలను పరిశీలించిన తర్వాతే మాట్లాడాలని కోరారు.గ్రామాభివృద్ధికి ఆటంకం కలిగించే ప్రచారాన్ని సహించబోమని పాలకవర్గ సభ్యులు హెచ్చరించారు. ప్రజలు తప్పుడు ప్రచారాన్ని నమ్మకుండా వాస్తవాలను తెలుసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొల్లు పులమ్మ నాగయ్య, ఉపసర్పంచ్ బెల్లంకొండ నాగయ్య, వార్డు సభ్యులు టి.పుల్లారావు, మరీదు శ్రీనివాస్, అల్లి ఉపేందర్, కొండ లక్ష్మయ్య, షేక్ షాకీర్ బాషా, సతీష్, చేపూరి కొండలు, అంబాల భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.



బుద్వేల్‌లో ఘనంగా గణపతి ప్రతిష్ఠాపన



ప్రజా వాయిస్/ రాజేంద్రనగర్:

వినాయక చవితి సందర్భంగా సర్కిల్ పరిధి బుద్వేల్ గ్రామంలోని శ్రీశ్రీ శివాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో భారీ గణనాథుడిని ప్రతిష్ఠించారు.వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ పూజా కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.ఆలయ పరిసరాలు భక్తుల రాకతో సందడిగా మారాయి.

పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక ప్రతిమల తయారీ

- తారా ప్రభుత్వ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం



ప్రజా వాయిస్ సంగారెడ్డి

తారా ప్రభుత్వ కళాశాల , సంగారెడ్డిలో ఈకో క్లబ్ ఆధ్వర్యంలో "జశ్రీమ్ముఅ ఘఅఽ +తీవవఅ జ్ఞుఎజూబం" కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో మట్టి వినాయక ప్రతిమల తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. ప్రవీణ మాట్లాడుతూ, మట్టి వినాయక ప్రతిమలను తయారు చేసి పూజించడం వల్ల పర్యావరణానికి కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసే విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, అందువల్ల సహజమైన మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను ఉపయోగించడం పర్యావరణహితమైన విధానమని తెలిపారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈకో క్లబ్ కన్వీనర్ డా. బి. సోఫియా రాణి, వైస్ ప్రిన్సిపాల్ డా. సుచిత్రా సింగ్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. ఈకో క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టి వినాయక ప్రతిమల తయారీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. "మట్టి వినాయకుడు – పర్యావరణానికి మేలు, మన ఆరోగ్యానికి మేలు" అనే సందేశాన్ని విద్యార్థులు సమాజానికి అందించారు. కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణ, నీటి కాలుష్య నివారణ మరియు ప్లాస్టిక్/రసాయన రహిత పండుగల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

కురిసిన వర్షం రైతుల్లో ఆనందం...

- తుఫాన్ ప్రభావంతో గట్టెక్కినా పత్తి రైతులు

- సంగారెడ్డి జిల్లాలో విస్తారంగా వర్షాలు

ప్రజా వాయిస్ సంగారెడ్డి :



సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వర్షాలు తుఫాను ప్రభావంతో విస్తారంగా కురిసాయి. వరి పంట సాగు చేసే రైతులకు ఆశించిన స్థాయిలో వర్షం లేకపోయినా పత్తి రైతులకు మాత్రం కాస్త ఊరట కల్పించింది.పత్తి రైతులు పంట సాగు చేసుకుని చేతికి వచ్చే సమయంలో వర్షాలు కురువని సమయంలో పత్తి పంట మొఖం చాటేసింది. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడి వస్తుందా రాదో అన్న అయ్యోమయంలో పడిన సందర్భంలో గత రెండు రోజులుగా అడప కురిసిన వర్షాలతో రైతుల్లో కాస్త ఆశలు చిగురించాయి. పెట్టిన పెట్టుబడి కట్టే లాభం రాకపోయినా కనీసం పెట్టుబడిన వస్తుందన్న ఆశ లో రైతులు ఉన్నారు. ప్రకృతి వైపరీత్యాలు ఎప్పుడు ఏ సమయంలో ఎలా ఉంటుందో తెలియని పరిస్థితి. మొక్కలు నాటిన నుంచి ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురియక పోవాడంతో పంట చేతికి వస్తుందా రాదా అన్న అనుమానంతో రైతులు ఆందోళన చెందారు. కానీ చివరి సమయంలో వర్షాలు పడడంతో ఆశలు రైతుల్లో చిగురించాయి.



పాల్వాయి రామాలయంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

ప్రజా వాయిస్ : గుర్రంపోడు మండలం

పాల్వాయి గ్రామంలోని రామాలయం ప్రాంగణంలో వినాయక చవితి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు,నిర్వహించారు.ఈ సందర్భంగా పాల్వాయి సర్పంచ్ బైరెడ్డి సత్యనారాయణ, సముద్రాల వెంకన్న దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.పురోహితులు నిమ్మగడ్డ సత్యనారాయణ ఆధ్వర్యంలో మంత్రోచ్ఛారణల మధ్య పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి.మంగళ వాయిద్యాల నడుమ రామాలయం ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. వినాయకుడి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



కస్తూరి లక్ష్యం... కాలుష్యం నివారించడం

ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

ఫౌండేషన్ సభ్యుడు వీరమల్ల కార్తీక్ గౌడ్

ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురంలో కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో, ఫౌండేషన్ సభ్యుడు వీరమల్ల కార్తీక్ గౌడ్ స్థానిక యువతకు మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి గ్రామస్థులు పెద్ద ఎత్తున హాజరై విగ్రహాలను ఉత్సాహంగా స్వీకరించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీ చరణ్ గత కొన్ని సంవత్సరాలుగా వినాయక చవితి సందర్భంగా ఈ సేవా కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తున్నారని తెలిపారు. కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో భవిష్యత్‌లో కూడా పర్యావరణ పరిరక్షణతో పాటు మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మందుగుల బాలకృష్ణ, పాలకుర్ల యాదయ్య, తెలంగాణ బిక్షం, ఎలిజాల శీను, సిలివేరు సైదులు, బద్దం యాదయ్య, కొండ శ్రీకాంత్, దూసరి వెంకటేశం, బైకని నరేందర్, రామకృష్ణ, వేణు, రాజు, వీడం సాయి, ప్రభాకర్, సునీల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు



వినాయక నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలి....

జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్....

జిల్లా ప్రజలకు, సిబ్బందికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ....

ప్రజా వాయిస్/ నల్గొండ క్రైమ్:

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద సోమవారం జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, జిల్లాలో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ... జిల్లా ప్రజలకు, సిబ్బందికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, పరస్పర గౌరవంతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు.ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీస్ శాఖ తరపున అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు పోలీస్ శాఖ సూచనలు, నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని సూచించారు.ప్రజలు పండుగను ఆనందంగా, సోదరభావంతో జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ కోరారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఎస్.బి. సీఐ నాగరాజు, ఆర్.ఐలు సంతోష్, సూరప్ప నాయుడు, కళ్యాణ్ రాజ్, ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీస్ అధికారులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..



11 ఏళ్లుగా ఎండిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న మాద్రి పృథ్వీరాజ్

పటాన్ చెరువు ప్రజావాయిస్

ఎండిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వీణ= ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో పటాన్‌చెరు పట్టణంలోని వెంకటేశ్వర థియేటర్ సమీపంలోని న్యూ మార్కెట్ వద్ద భక్తులకు మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఎండిఆర్ ఫౌండేషన్ గత 11 ఏళ్లుగా ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తోంది. ఈ ఏడాది ఆన్‌లైన్‌లో ముందుగా నమోదు చేసుకున్న భక్తులకు ఎండిఆర్ ఫౌండేషన్ కార్యాలయంలో మరియు స్థానిక ప్రజలకు కూడా విగ్రహాలను అందజేశారు. కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.కార్యక్రమానికి సహకరించిన స్థానిక ప్రజలకు, మట్టి వినాయక విగ్రహాలను స్వీకరించిన భక్తులకు పృథ్వీరాజ్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలందరూ వినాయక చవితిని సంతోషంగా జరుపుకోవాలని కోరుతూ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎన్టీఆర్ ఫౌండేషన్ సభ్యులు వివిధ కాలనీల ప్రజలు పాల్గొని మట్టి గణపతులను స్వీకరించారు ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు 11 సంవత్సరాలుగా ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎన్టీఆర్ ఫౌండేషన్ చైర్మన్ పృథ్వీరాజ్ కు కృతజ్ఞతలు తెలిపారు

పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత

మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి

అమీన్ పూర్ ప్రజావాయిస్



పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని, ప్రకృతికి హాని కలిగించని మట్టి వినాయకులనే పూజించి భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలని అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి పిలుపునిచ్చారు. అమీన్పూర్ డివిజన్ పరిధిలోని భారత నగర్ కాలనీలో స్థానికులతో కలిసి ఆయన మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి వినాయక చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణహితంగా జరుపుకోవాలని సూచించారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వల్ల జల వనరులు కలుషితమై మూగజీవాలతో పాటు మానవ మనుగడ కూడా ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మన పూర్వీకులు నేర్పిన సంప్రదాయ పద్ధతిలో మట్టితో చేసిన ప్రతిమలను పూజించడమే భారతీయ సంస్కృతి అని స్పష్టం చేశారు. కాలనీ వాసులలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరుగుతుండడం శుభపరిణామమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో మట్టి వినాయకులనే ప్రతిష్టించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యులు తల్లారి రాములు, సీనియర్ నాయకులు,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో కొలువుదీరిన గణనాథుడు

- ప్రత్యేక పూజలు నిర్వహించిన అదనపు కలెక్టర్

ప్రజావాయిస్/వికారాబాద్:

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి జిల్లా అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వినాయకునికి పంచామృత అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలు కలగాలని స్వామివారిని ప్రార్థించారు.వినాయక చవితి పండుగను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని అదనపు కలెక్టర్ ఆకాంక్షించారు. అదే సమయంలో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, పర్యావరణానికి హాని కలిగించని మట్టి వినాయక విగ్రహాలను వినియోగించడాన్ని ప్రోత్సహించాలని సూచించారు.ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో రామకృష్ణ సీసీ, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న జాదవ్ రమేష్‌కు టి ఎస్ టి డబ్ల్యూ టి యు అభినందనలు

మారుమూల గిరిజన గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి అవార్డు వరకు సాగిన ప్రస్థానం

ప్రజా వాయిస్ ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఝరి పునాగూడకు చెందిన స్కూల్ అసిస్టెంట్ (బయాలజీ సైన్స్) జాదవ్ రమేష్‌కు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. హైదరాబాద్‌లో ఈనెల 5న విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.మారుమూల గిరిజన గ్రామంలో పేదరికంలో జన్మించిన రమేష్, చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయినప్పటికీ చదువు కొనసాగించారు. 2001లో గిరిజన సంక్షేమ శాఖలో ఎస్.జి.టి.గా ఉద్యోగంలో చేరి, తిర్యాణి మండలం చిన్న దంపూర్ ప్రాథమిక పాఠశాలలో గిరిజన విద్యార్థులకు బోధించారు. అనుభవం, కృషితో స్కూల్ అసిస్టెంట్ స్థాయికి ఎదిగారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘం (ఎస్ టి డబ్ల్యూ టి యు) కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కార్యవర్గం జాదవ్ రమేష్‌కు అభినందనలు తెలిపింది.

పెంచికల్‌పేట్‌లో గురుకుల పాఠశాల నిర్మాణానికి డిమాండ్

ఎమ్మెల్యే ఎమ్మెల్సీకు వినతి

ఎల్కపల్లి శివారులో 25 ఎకరాల ప్రభుత్వ భూమి గుర్తింపు

సానుకూలంగా స్పందించిన ప్రజాప్రతినిధులు

ప్రజా వాయిస్ ఆసిఫాబాద్

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండల కేంద్రంలోనే సమీకృత గురుకుల పాఠశాల నిర్మించాలని కోరుతూ ఎల్కపల్లి శివారులోని సర్వే నంబర్ 61లో 25 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి, ఛలో కాగజ్‌నగర్ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ అంశాన్ని ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి సర్వే చేయించి పాఠశాల నిర్మాణానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్లు ఎలగందుల తిరుపతి, తెలిగే రమేష్, తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి సన్నిధిలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు, అభిషేకం



ప్రజా వాయిస్ / ఆత్మకూరు (ఎం): నల్లగొండ జిల్లా నార్కెట్‌పల్లి మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం చెరువుగట్టు శ్రీ రామలింగేశ్వర స్వామివారిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకం చేశారు.ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో బీర్ల అయిలయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వచనాలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆలేరు నియోజకవర్గ ప్రజలపై శ్రీ రామలింగేశ్వర స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.చెరువుగట్టు రామలింగేశ్వర స్వామి ఆలయానికి నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. భక్తుల సౌకర్యాల విషయంలో అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

మంచిర్యాల జిల్లా అధ్యక్షులు చంద్రమోహన్ గౌడ్

ప్రజా వాయిస్ /మంచిర్యాల

తెలంగాణ రక్షణ సేన మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా విద్యావేత్త, ప్రముఖ సామాజిక కార్యకర్త డాక్టర్ ఉదారి చంద్రమోహన్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సోమవారం వివిధ జిల్లాల అధ్యక్షుల నియామకాలను అధికారికంగా ప్రకటించారు. ఇందులో భాగంగానే చంద్రమోహన్ గౌడ్‌కు మంచిర్యాల జిల్లా బాధ్యతలను అప్పగించారు.తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా కీలక బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవితకు చంద్రమోహన్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కవిత ఆశీస్సులతో పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు. కవిత ప్రతిపాదించిన 'పాంచజన్య' సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్తామని వెల్లడించారు. విద్య, ఉపాధి, వైద్యం, వ్యవసాయం రంగాల అభివృద్ధి మరియు సామాజిక న్యాయమే ధ్యేయంగా తెలంగాణ రక్షణ సేన పనిచేస్తుందని, ఈ లక్ష్యాల సాధనకోసం అందరం కలిసికట్టుగా అడుగులు వేస్తామని ఆయన పేర్కొన్నారు.

పంట కోసం వేసిన విద్యుత్ కంచె...

ప్రాణమే తీసింది!

ప్రజా వాయిస్ జైపూర్,

సెప్టెంబర్ 14



ఫైల్ ఫోటో

కూరగాయల తోట రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న విద్యుత్ కంచె ఓ రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి ప్రాణాలనే బలితీసుకుంది. జైపూర్ మండలం శెట్టిపల్లి గ్రామంలో సోమవారం ఈ విషాద సంఘటన చోటుచేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం... శెట్టిపల్లి గ్రామానికి చెందిన బండారి నారాయణ తన ఇంటి ఆవరణలోని పెరట్లో వేసుకున్న కూరగాయల తోటను కోతుల బెడద నుంచి కాపాడుకునేందుకు చుట్టూ విద్యుత్ కంచెను ఏర్పాటు చేసుకున్నాడు. సోమవారం ఉదయం ఆ కంచె విద్యుత్ తీగ తగిలి ఒక కోతి మృతిచెందింది.అనంతరం బయటి పనులకు వెళ్లిన నారాయణ, తిరిగి వచ్చి పెరట్లోకి వెళ్లే క్రమంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం మరచిపోయాడు. ప్రమాదవశాత్తు తను అమర్చిన విద్యుత్ కంచెకే తగలడంతో తీవ్ర విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై భూమేష్ వెల్లడించారు.

తండా నుంచి టెక్నాలజీ దాకా.!

మారుతున్న లంబాడీ జీవన చిత్రం
సంచార జీవితం నుంచి స్థిర నివాసాల వరకు..
చదువు, ఉపాధితో కొత్త ప్రపంచంలోకి అడుగులు
సంప్రదాయాలను కాపాడుకుంటూనే ఆధునికత వైపు పయనం

ప్రజా వాయిస్,ప్రత్యేక కథనం:

లంబాడీ సమాజం.. ఒకప్పుడు సంచార జీవనం, పశు పోషణ, వాణిజ్యం, వ్యవసాయం, ప్రకృతి ఆధారిత జీవనంతో ముడిపడిన సమాజం. తండా కేంద్రంగా సాగిన సామూహిక జీవనం, ప్రత్యేకమైన వేషధారణ, అద్దాల ఎంబ్రాయిడరీ, జానపద పాటలు, నృత్యాలు, పండుగలు ఆ సమాజానికి ప్రత్యేక గుర్తింపును తెచ్చాయి. కాలంతో పాటు ఆ జీవన విధానంలో అనేక మార్పులు వచ్చాయి. స్థిర నివాసాలు, విద్య, రహదారులు, విద్యుత్, మార్కెట్ వ్యవస్థ, ప్రభుత్వ పథకాలు, పట్టణీకరణతో పాటు మొబైల్ ఫోన్, ఇంటర్నెట్, డిజిటల్ సేవలు లంబాడీ జీవనంలో భాగమయ్యాయి.

సంచారం నుంచి స్థిర నివాసం

గతంలో జీవనోపాధి కోసం ప్రాంతాల మధ్య సంచరించిన లంబాడీ సమూహాలు క్రమంగా తండాల్లో స్థిరపడ్డాయి. స్థిర నివాసాలతో వ్యవసాయం, విద్య, ప్రభుత్వ సేవలు, స్థానిక పాలనతో అనుబంధం పెరిగింది. తండా కేవలం ఇళ్ల సమూహం కాదు.. కుటుంబ బంధాలు, ఆచారాలు, పండుగలు, పాటలు, సామాజిక సంబంధాలను మోసుకెళ్లే జీవంతమైన వ్యవస్థ.

మారిన ఇల్లు.. మారిన జీవితం

సంప్రదాయ నివాసాల స్థానంలో పక్కా ఇళ్లు వచ్చాయి. విద్యుత్, తాగునీరు, రహదారులు, ప్రభుత్వ గృహ పథకాలతో తండాల రూపురేఖలు మారుతున్నాయి. మరోవైపు ఉద్యోగాల కోసం యువత పట్టణాలకు వెళు ్తండటంతో కుటుంబ, సామాజిక సంబంధాల్లోనూ కొత్త మార్పులు కనిపిస్తున్నాయి. అయితే మొబైల్ ఫోన్ ద్వారా తండాతో అనుబంధం కొనసాగుతోంది.

పళ్లెంలోనూ ఆధునికత

స్థానిక ధాన్యాలు, పప్పులు, ఆకుకూరలు, కూరగాయలు, అడవి ఉత్పత్తులతో సాగిన సంప్రదాయ ఆహారపు అలవాట్లలోనూ మార్పులు వచ్చాయి. మార్కెట్, ప్యాకేజ్డ్ ఆహారం, పట్టణ జీవనశైలి ప్రభావం పెరిగింది. సంప్రదాయ ఆహార జ్ఞానాన్ని నమోదు చేసి భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉంది.

భాష.. గుర్తింపుకు ఆధారం

భాషలోనే ఒక సమాజ చరిత్ర, జ్ఞాపకాలు, పాటలు, సామెతలు, జీవన జ్ఞానం దాగి ఉంటాయి. ఇంట్లో మాతృభాష.. పాఠశాలలో మరో భాష.. ఉన్నత విద్యలో మరో భాషను ఉపయోగించే పరిస్థితి ఏర్పడుతోంది. బహుభాషా సామర్థ్యం పెరుగుతున్నా మాతృభాష తరతరాలకు అందడంపై ప్రభావం పడే అవకాశం ఉంది. లంబాడీ భాషకు డిజిటల్ పదకోశాలు, ఆడియో,వీడియో భద్రపరిచే కార్యక్రమాలు అవసరం.

అద్దాల కళకు కొత్త మార్కెట్

లంబాడీ మహిళల సంప్రదాయ దుస్తులు, అద్దాల పనితనం, ఎంబ్రాయిడరీ, ఆభరణాలు సంస్కృతికి ప్రతీకలు. రోజువారీ జీవితంలో సంప్రదాయ దుస్తుల వినియోగం తగ్గుతున్నా.. అదే కళలకు కొత్త మార్కెట్ అవకాశాలు ఉన్నాయి. ఆధునిక డిజైన్లు, ఈ-కామర్స్‌తో అనుసంధానిస్తే మహిళలకు ఉపాధి, ఆదాయం పెంచవచ్చు.

పాటల్లో చరిత్ర.. నృత్యాల్లో సంస్కృతి

లంబాడీ పండుగలు, వివాహాలు, జానపద పాటలు, నృత్యాలు సమాజ సామూహిక జ్ఞాపకాలను తరతరాలకు అందిస్తున్నాయి. ముఖ్యంగా వృద్ధులు చెప్పే కథలు, పాడే పాటలు విలువైన మౌఖిక చరిత్ర. వీటిని ఆడియో, వీడియో రూపంలో డిజిటల్ ఆర్కైవ్‌లుగా భద్రపరచాల్సిన అవసరం ఉంది.

చదువే.. మార్పుకు బాట

విద్య లంబాడీ సమాజంలో కొత్త అవకాశాలకు తలుపులు తెరిచింది. ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాలు, సాంకేతిక విద్య, పోటీ పరీక్షలు, కొత్త ఉపాధి రంగాల్లో యువత అడుగులు వేస్తోంది.అయితే పాఠశాలలో చేరిక మాత్రమే సరిపోదు. చేరిక నుంచి హాజరు.. హాజరు నుంచి ఉన్నత విద్య.. అక్కడి నుంచి నైపుణ్యం.. చివరికి ఉపాధి వరకు నిరంతర మద్దతు అవసరం. బాలికల విద్య, హాస్టళ్లు, డిజిటల్ విద్యకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి.

ఆరోగ్యంపై అవగాహన

తండాల నుంచి ఆసుపత్రులకు దూరం, రవాణా, ఆర్థిక స్థోమత, తాగునీరు, పారిశుద్ధ్యం, పిల్లల పోషణ, మహిళల ఆరోగ్యం వంటి అంశాలు కీలకం. సంప్రదాయ ఆరోగ్య జ్ఞానాన్ని శాస్త్రీయంగా నమోదు చేస్తూనే ఆధునిక వైద్య సేవలు ప్రతి తండాకు అందుబాటులో ఉండాలి.

చేతిలో సెల్‌ఫోన్.. కొత్త అవకాశాలు

మొబైల్, ఇంటర్నెట్ యువతకు కొత్త ప్రపంచాన్ని పరిచయం చేశాయి. ఉద్యోగ సమాచారం, ఆన్‌లైన్ విద్య, పోటీ పరీక్షల మెటీరియల్, ప్రభుత్వ పథకాలు, డిజిటల్ బ్యాంకింగ్ అందుబాటులోకి వచ్చాయి.అయితే ఫోన్ ఉండటం మాత్రమే డిజిటల్ సాధికారత కాదు. పరికరం, ఇంటర్నెట్, డిజిటల్ అక్షరాస్యత, నాణ్యమైన సమాచారం, భాషా ప్రాప్యత కలిసినప్పుడే పూర్తి ప్రయోజనం లభిస్తుంది.

మహిళలే.. మార్పుకు చోదకశక్తి

కుటుంబం, వ్యవసాయం, పశుపోషణ, హస్తకళలు, సంప్రదాయ జ్ఞానంలో లంబాడీ మహిళల పాత్ర కీలకం. విద్య, స్వయం సహాయక సంఘాలు, ఉపాధి, వ్యాపారం, రాజకీయ భాగస్వామ్యం ద్వారా అవకాశాలు పెరుగుతున్నాయి.మహిళలను కేవలం పథకాల లబ్ధిదారులుగా కాకుండా నిర్ణయాధికారులు, అభివృద్ధి భాగస్వాములుగా చూడాలి.

రాజకీయంగా కొత్త అడుగులు

స్థానిక సంస్థల నుంచి రాష్ట్ర స్థాయి వరకు లంబాడీ సమాజ రాజకీయ భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉంది. రాజకీయ సాధికారత అంటే ఎన్నికల్లో పోటీ చేయడమే కాదు.. హక్కులపై అవగాహన, ప్రభుత్వ పథకాలపై పర్యవేక్షణ, విధాన నిర్ణయాల్లో భాగస్వామ్యం, యువతలో రాజకీయ చైతన్యం కూడా అంతే ముఖ్యం.

సంప్రదాయం పోకూడదు.. రూపం మారాలి

ఆధునికతను అడ్డుకోవడం పరిష్కారం కాదు. సంప్రదాయాలను పూర్తిగా వదిలేయడం కూడా సమాధానం కాదు. సంప్రదాయాన్ని కాపాడుకుంటూనే సాంకేతికతను అందిపుచ్చుకోవడమే భవిష్యత్ దిశ.తండాల చరిత్ర, లంబాడీ భాష, పాటలు, నృత్యాలు, వంటకాలు, వేషధారణ, ఎంబ్రాయిడరీ, సంప్రదాయ జ్ఞానాన్ని డిజిటల్‌గా భద్రపరచాలి.

2047 లక్ష్యం.. సమాన అవకాశాలు

రేపటి లంబాడీ సమాజం చదువుకున్నదిగా, ఆర్థికంగా స్వయం సమృద్ధిగా, రాజకీయంగా చైతన్యవంతంగా, సాంకేతికంగా ముందంజలో ఉండాలి. మహిళలకు సమాన అవకాశాలు, యువతకు నైపుణ్యాలు, ప్రతి కుటుంబానికి మెరుగైన ఆరోగ్యం--విద్య, సంస్కృతికి రక్షణ లభించాలి.అభివృద్ధి అంటే పక్కా ఇల్లు ఒక్కటే కాదు..

అవకాశాల్లో సమానత్వం.
విద్యకు ప్రాప్యత.
ఆర్థిక స్వావలంబన.
రాజకీయ స్వరం.
మహిళా సాధికారత.

సాంస్కృతిక గుర్తింపును కాపాడుకుంటూ ఆధునికతను స్వీకరించడం.లంబాడీ సమాజ జీవన ప్రయాణం ఇంకా కొనసాగుతూనే ఉంది. గతాన్ని జ్ఞాపకంగా.. వర్తమానాన్ని అవకాశంగా.. భవిష్యత్తును లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగడమే కొత్త తండా దిశ..



కోటియా నాయక్
భూక్యా కోడాడ
సూర్యాపేట జిల్లా

పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలను వాడుదాం

మట్టి గణపతే మహాగణపతి
కస్తూరి ఫౌండేషన్ నల్లగొండ జిల్లా కో ఆర్డినేటర్ గుడిపాటి కోటయ్య

ప్రజా వాయిస్,మిర్యాలగూడ :

వినాయక చవితిని ప్రతి ఒక్కరు భక్తి శ్రద్ధలతో జరుపుకోవడమే కాకుండా మట్టి విగ్రహాలను పూజించాలని తద్వారా వాటిని నిమజ్జనం చేయడం వల్ల ఆ మట్టి నీళ్లలో కరిగి పర్యావరణ పరిరక్షణ కు దోహదపడుతుందని కస్తూరి ఫౌండేషన్ నల్లగొండ జిల్లా కో ఆర్డినేటర్ గుడిపాటి కోటయ్య అన్నారు. కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ శ్రీచరణ్ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం మట్టి వినాయక విగ్రహాలు నాణ్యమైన జ్యూట్ బ్యాగు, వ్రత పుస్తకం ఉచితశే గా పంపిణి చేయడం జరుగుతుందని, అందులో భాగంగా మిర్యాలగూడ లో పంపిణి చేయడం జరిగిందని, మిర్యాలగూడ పట్టణ ప్రజలు మట్టి విగ్రహాలు ప్రతిష్టించుకొని సుఖ సంతోషాలతో, భక్తి శ్రద్ధలతో వినాయక ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు. చేసేది మట్టితో అలంకరించేది ఆకులతో పూజించేది పూలతో గణపతి అంటే ఆకృతి కాదు ప్రకృతి ఇది మన సనాతన సాంప్రదాయానికి నిదర్శనం అని అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో చేసిన వినాయక విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల దాని తయారికి ఉపయోగించే జిప్సుశీ,సల్ఫర్, పాస్పరస్, మెగ్నీషియం, కాడ్మియం, లెడ్, సీసం వంటి రసాయన పదార్థాలు నిమజ్జనం చేసినపుడు నీటిలో కరగక నీటిని కలుషితం చేసి నీటిలో నివషించే జీవరాసులకు హాని కలిగించడం, పర్యావరణం దెబ్బతినడం జరుగుతుందని, మట్టి విగ్రహాలు వాడి నిమజ్జనం చేయడం వల్ల లాభాలు వుంటాయని, పర్యావరణ హితం కోసం కస్తూరి



ఫౌండేషన్ కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కస్తూరి ఫౌండేషన్ సభ్యులు అంబటి వీరనారాయణ, చిలుక నరేందర్ రెడ్డి, షేక్ ఉస్మాన్ యాదవ సంఘం పట్టణ అధ్యక్షులు కట్టెబోయిన శ్రీనివాస్, గుడిపాటి వివేక్ యాదవ్, అంబటి శ్రీను, వడ్డేపల్లి వెంకటేష్, రాపోలు పరమేష్, కురువ తదితరులు పాల్గొన్నారు.

నేడు నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో మంత్రి సీతక్క పర్యటన

కామారెడ్డి నిజామాబాదులో మంత్రి రాకకు ఏర్పాట్లు పూర్తి
కామారెడ్డిలో 33 కోట్లతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం పునరుద్ధరణ

ప్రజావాయిస్ కామారెడ్డి జిల్లా ప్రతినిధి/

మంగళవారం నాడు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ, శిశు సంక్షేమ సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కామారెడ్డి నిజామాబాద్ జిల్లాలలో పర్యటిస్తున్నారని అధికార, కాంగ్రెస్ పార్టీ వర్గాలు వెల్లడించాయి. మంగళవారం ఉదయం 10 గంటలకు కామారెడ్డి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర హై స్కూల్ నూతన భవనానికి శంకుస్థాపన మంత్రి సీతక్క చేత జరుపుతున్నారని ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ పాల్గొంటారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. వందేళ్ళ క్రితం నిజాం ప్రభువు కాలంలో నిర్మించిన కామారెడ్డి జిల్లా పరిషత్ పాఠశాల భవనాన్ని కూల్చివేస్తూ 33 కోట్ల రూపాయలతో పునరుద్ధరిస్తున్నారు. కామారెడ్డి జిల్లా పరిషత్ బాలుర పాఠశాలకు ముఖ్యమంత్రి నిధి నుండి ఐదు కోట్ల రూపాయలు, సిఎస్ఆర్ నిధుల నుండి మూడు కోట్ల రూపాయలు, మరో ప్రభుత్వ స్పెషల్ గ్రాండ్ నుండి 25 కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఇప్పటికీ మంత్రి సీతక్క పర్యటన మూడుసార్లు వాయిదా పడింది. వర్షాలు పడుతున్న రాష్ట్ర మంత్రి సీతక్క పర్యటన ఉంటుందని పార్టీ వర్గాలు తెలిపాయి. మొత్తం 33 కోట్ల రూపాయలతో కామారెడ్డి బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాన్ని వర్గాల ఏర్పాట్లు పూర్తయినట్లు అధికార వర్గాలు సర్వాంగ సుందరంగా నిర్మిస్తున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. అత్యాధునిక కంప్యూటర్ సౌకర్యాలు డిజిటల్ క్లాసులు నూతన టెక్నాలజీతో కామారెడ్డి జిల్లా పరిషత్ బాలుర పాఠశాల భవనాన్ని నిర్మిస్తున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. కామారెడ్డిలో జడ్పీ హైస్కూల్ శంకుస్థాపన అనంతరం మంత్రి సీతక్క నిజామాబాద్ జిల్లాలో పర్యటిస్తారు. నిజామాబాద్ లో చెక్కుల పంపిణీ ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు జరుపుతున్నారని అధికార వర్గాలు తెలిపాయి. మంత్రి సీతక్క పర్యటనకు కామారెడ్డి నిజామాబాద్ జిల్లాలలో పోలీస్ బందోబస్తు ఇతర అధికార



గిరిజనుల హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలి

బీఆర్ఎస్ శ్రేణులు ప్రజల పక్షాన నిలవాలి

కేటీఆర్ ఆదేశాలతో ములుగులో గిరిజన ముఖ్య కార్యకర్తల సమావేశం

బడే నాగజ్యోతి,మాజీ జడ్పీ చైర్ పర్సన్, బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జీ

ప్రజా వాయిస్; ములుగు జిల్లా:/

ములుగు నియోజకవర్గంలో గిరిజన కార్యకర్తలను ఏకతాటిపైకి తీసుకువచ్చి ప్రజా సమస్యలపై సమిష్టిగా పోరాడేందుకు బీఆర్ఎస్ పార్టీ కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 15న ఉదయం 11 గంటలకు ములుగు పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గిరిజన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి తెలిపారు.

గిరిజన సమస్యలపై సమగ్ర చర్చ:

సమావేశంలో ములుగు నియోజకవర్గంలోని గిరిజన మాజీ మండల అధ్యక్షులు, గిరిజన సర్పంచులు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొననున్నారు. గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, హక్కుల పరిరక్షణ, సంక్షేమ పథకాల అమలు, స్థానిక ప్రజల సమస్యలు, భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు:

గిరిజన ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని బడే నాగజ్యోతి పిలుపునిచ్చారు. గిరిజన నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తే ప్రజా సమస్యలపై మరింత బలమైన పోరాటం చేయవచ్చని అన్నారు.ములుగు నియోజకవర్గంలోని గిరిజన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని బడే నాగజ్యోతి కోరారు. సమావేశం అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.





గణేష్ గడ్డ శ్రీ సిద్ధి వినాయక దేవాలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

ఆలయంలో ప్రత్యేక పూజలు

నియోజకవర్గ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు

పటాన్ చెరువు ప్రజావాయిస్

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని రుద్రారం గణేష్ గడ్డ శ్రీ సిద్ధి వినాయక దేవాలయాన్ని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని.. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, శాంతి, సౌభాగ్యాలతో జీవించాలని ప్రార్థించారు.ఆలయ కమిటీ చైర్మన్, స్థానిక ప్రజాప్రతినిధులు.. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు.పటాన్చెరు నియోజకవర్గ ప్రజలందరికీ వినాయక చవితి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇస్నాపూర్ మున్సిపల్ చైర్మన్ కౌన్సిలర్లు టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు భక్తులు తదితరులు పాల్గొన్నారు



తెలంగాణ బార్ కౌన్సిల్‌కు కొత్త చైర్మన్‌గా రాంరెడి

ప్రజా వాయిస్ హైదరాబాద్ డెస్క్..

తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో సాముల రామ్‌రెడ్డి చైర్మన్‌గా, చలకాని వెంకట్ యాదవ్ వైస్ చైర్మన్‌గా, జి.కిరణ్ కుమార్ బీసీఐ సభ్యుడిగా ఎన్నికయ్యారు.చైర్మన్ పదవికి రామ్‌రెడ్డికి 12, మంత్రి పొన్నం ప్రభాకర్ సోదరుడు పొన్నం అశోక్ గౌడ్‌కు 11 ఓట్లు రాగా, ఒక్క ఓటు తేడాతో రామ్‌రెడ్డి గెలిచారు.వైస్ చైర్మన్ పదవికి వెంకట్ యాదవ్‌కు 13, జకీర్ హుస్సేన్ జావెద్‌కు 10 ఓట్లు రాగా మూడు ఓట్ల ఆధిక్యంతో వెంకట్ యాదవ్ నెగ్గారు, బీసీఐ స్థానంలో జి.కిరణ్ కుమార్ జగదీశ్వర్ రావుపై 3 ఓట్ల తేడాతో గెలిచారు.ఎనిమిదేళ్ల తర్వాత జరిగిన ఈ ఎన్నికలను సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జనవరి 30న నిర్వహించగా, ఓట్ల లెక్కింపు మార్చి 24న పూర్తయింది.



మరో 18 నియోజకవర్గాలకు ఇన్‌చార్జులను ప్రకటించిన కవిత

రాష్ట్ర రాజకీయాల్లో సొంత పార్టీ తెలంగాణ రక్షణ సేనను బలోపేతం చేసుకునే దిశగా ఆ పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత శరవేగంగా అడుగులు వేస్తున్నారు. సంస్థాగత నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించిన ఆమె, తాజాగా వినాయక చతుర్థి శుభసందర్భాన్ని పురస్కరించుకుని పార్టీ పరంగా పలు కీలక నియామకాలను చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా మరో 18 కీలక అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జులను ఖరారు చేయడంతో పాటు, పలు జిల్లాలకు నూతన అధ్యక్షులను, అనుబంధ విభాగాల వారీగా బాధ్యులను నియమిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు.ఈ తాజా జాబితాతో కలిపి ఇప్పటివరకు రాష్ట్రంలోని మొత్తం 60 అసెంబ్లీ స్థానాలకు ఇన్‌చార్జుల నియామకం పూర్తయినట్లయింది. గ్రేటర్ హైదరాబాద్ పరిసర ప్రాంతాలైన పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, నాంపల్లి, అంబర్‌పేట్, ఇబ్రహీంపట్నంతో పాటు ఉత్తర, దక్షిణ తెలంగాణలోని ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, ఖానాపూర్, నిర్మల్, హుజూరాబాద్, దేవరకొండ, ఇల్లందు, అశ్వారావుపేట నియోజకవర్గాలకు కొత్త ఇన్‌చార్జులను నియమించారు. దీనికి తోడు మెదక్ లోక్‌సభ స్థానానికి కూడా పార్టీ అధ్యక్షుడిని ప్రకటించడం ద్వారా తెలంగాణ రక్షణ సేన రాబోయే ఎన్నికల వ్యూహానికి సమరశంఖం పూరించినట్లయింది.

గోవాలో యూసీసీ అమలు చేయాలి.. అమిత్ షాకు అసదుద్దీన్ సవాల్



కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ సవాల్ విసిరారు. 2029 నాటికి ఎన్డీయే పాలిత ప్రాంతాల్లో ఉమ్మడి పౌర స్మృతిని (యూసీసీ) అమలు చేస్తామని అమిత్ షా చేసిన ప్రకటనపై ఓవైసీ తీవ్రంగా స్పందించారు. “మీకు ధైర్యం ఉంటే, ముందుగా గోవాలో యూసీసీని అమలు చేయండి” అని ఆయన వ్యాఖ్యానించారు.భారతదేశం వంటి విభిన్న సంస్కృతులు, విలక్షణ సంప్రదాయాలు కలిగిన దేశంలో అందరికీ ఒకే రకమైన చట్టాన్ని రుద్దడం సాధ్యం కాదని ఓవైసీ అభిప్రాయపడ్డారు. యూసీసీని తీసుకురావడం వల్ల రాజ్యాంగం గిరిజనులు, మైనారిటీలు, ఇతర సామాజిక వర్గాలకు కల్పించిన హక్కులకు, రక్షణకు భంగం వాటిల్లుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే కేంద్ర ప్రభుత్వం ఇటువంటి సున్నితమైన అంశాలను తెరపైకి తెస్తోందని ఓవైసీ ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. గోవాలో ఇప్పటికే కాథలిక్కులు, ఇతర వర్గాలకు వ్యక్తిగత చట్టాల్లో మినహాయింపులు ఉన్నాయని గుర్తు చేసిన ఆయన, ఆ మినహాయింపులను తొలగించకుండా దేశవ్యాప్తంగా యూసీసీని ఎలా అమలు చేస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు.

లండన్ పర్యటనలో రూ. 11 వేల కోట్ల భారీ పెట్టుబడుల ఒప్పందం కుదుర్చుకున్న సీఎం విజయ్



తమిళనాడును పారిశ్రామికంగా అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టే దిశగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ చేపట్టిన తొలి అధికారిక బ్రిటన్ పర్యటన అద్భుత విజయంతో ముగిసింది. లండన్ వేదికగా జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో బ్రిటన్‌కు చెందిన ప్రముఖ బహుళజాతి సంస్థలతో విజయ్ రూ. 11,000 కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ భారీ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి కొత్త ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు ప్రకటన వెలువడింది.ఈ పర్యటనలో ప్రధానంగా పునరుత్పాదన శక్తి, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, డేటా సెంటర్లు, అత్యాధునిక హెల్త్‌కేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాలలో ఒప్పందాలు కుదిరాయి. తమిళనాడును 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్యంలో భాగమే ఈ లండన్ డీల్ అని సీఎం విజయ్ తెలిపారు. విదేశీ పెట్టుబడిదారులకు ప్రభుత్వం తరఫున వేగవంతమైన అనుమతులు, ప్రత్యేక రక్షణ, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పోటీపడుతూ దక్షిణాదిని గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దడానికి ఈ ఒప్పందాలు దోహదపడనున్నాయని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.



పత్తికుంటలో మొదలైన గణనాథుల నిమజ్జన సందడి

తొలి రోజే 50కిపైగా విగ్రహాల నిమజ్జనం

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

ప్రజా వాయిస్/రాజేంద్రనగర్:

వినాయక చవితి సందర్భంగా రాజేంద్రనగర్ డివిజన్ హనుమాన్‌నగర్ వద్ద గల పత్తికుంటలో గణనాథుల నిమజ్జన సందడి ప్రారంభమైంది.ఉదయం ఇళ్లలో వినాయక ప్రతిష్ఠలు నిర్వహించిన భక్తులు, సాయంత్రం కుటుంబ సమేతంగా నిమజ్జనానికి తరలివచ్చారు.తొలి రోజే సుమారు 50కిపైగా చిన్న వినాయక విగ్రహాలను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిమజ్జన ప్రదేశంలో అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేశారు.ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలు జరిగేలా దాదాపు నెల రోజులుగా ఏర్పాట్లు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

భక్తులు సమన్వయంతో నిమజ్జనం నిర్వహించాలి: వై.శ్రీధర్

భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ వై.శ్రీధర్ మాట్లాడుతూ.పత్తికుంటలో నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. భక్తులు కుటుంబ సమేతంగా ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.ఉత్సవ కమిటీలు, భక్తులు,అధికారులు సమన్వయంతో పనిచేసి నిమజ్జన కార్యక్రమాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ జాయింట్ కన్వీనర్ ఈ.వేణుగోపాల్,స్థానిక ఉత్సవ కమిటీ నాయకులు రఘుమారెడ్డి,నరసింహ, ఈశ్వర్‌తో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఎస్ఎల్‌పీ అమ్మానాన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత గణపతుల పంపిణీ

హైదరాబాద్ /ప్రజా వాయిస్:-



హైదరాబాద్‌లోని ఉప్పల్ దేవేందర్ నగర్ కాలనీలో ఎస్ఎల్‌పీ అమ్మానాన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత గణపతుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ట్రస్ట్ చైర్మన్ లక్ష్మీ ప్రసన్న నేతృత్వంలో పర్యావరణ పరిరక్షణ కోసం ఈ మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ. పండుగ వేళ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులు ఎల్లప్పుడూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ సుబ్రహ్మణ్యం, ఎస్ఎల్‌పీ డైరెక్టర్ రాజేశ్వరి, లావణ్య, సంగీత తదితరులు పాల్గొన్నారు.